



రంజాన్ వేళలు	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
కడప	6.30	5.12
ప్రొద్దుటూరు	6.31	5.16



కబ్జాదారులు కాలువను ఆక్రమించి చదును చేసిన దృశ్యం

ప్రొద్దుటూరు పట్టణంలో రెవెన్యూ, మున్సిపాలిటీ రికార్డుల మేరకు ఉన్న కాలువలు ఆక్రమణలకు గురై ఉంటే వాటిని సర్వేచేసి ఆక్రమణలపై చర్యలు ప్రారంభించాలని అధికారులకు నెలల క్రితమే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. కానీ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో కాలువల కబ్జా యథేచ్ఛగా సాగుతోంది. తాజాగా 10 సెంట్ల కాలువ స్థలాన్ని ఆక్రమించి ఓ ప్రైవేటు వెంచర్‌కు దారి ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు సర్వే నెంబర్లలోని రెండు కాలువలు పట్టణం నడిబొడ్డులో ఉండటం.. ఇక్కడ స్థలం సెంటు లక్షల్లో పలకడంతో ఎక్కడోచోట ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కాలువను ఆక్రమించి కట్టిన ట్రాన్స్‌పోర్టు కార్యాలయం

కాలువల కబ్జా

- రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతం
- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ప్రొద్దుటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని టూటౌన్ బైపాస్ రోడ్డు నుంచి కొత్తపల్లి పంచాయతీలో కలిసే రెండు కాలువలు కబ్జా అయ్యాయి. ఇందులో మోడమీది పొలం సర్వేనెంబరు 568లో 0.47 ఎకరాలు ఉంది. ఈ కాలువ టూటౌన్ పోలీసు స్టేషన్ ఎదురుగా మొదలై ఆంజనేయస్వామి దేవళం వద్ద కొత్తపల్లె పంచాయతీలో కలుస్తుంది. పంచాయతీలో 118 సర్వే నెంబరుగా బయలుదేరి ఎఫ్‌జీ ఫంక్షన్ హాలు వరకు సాగుతుంది. ఈ కాలువ దాదాపు 2.10 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇక్కడ సెంటు భూమి రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలకు పైగా పలుకుతోంది. ఈ కాలువను పూడ్చి కొన్ని కట్టడాలు నిర్మించారు. అందులో ఒక ప్రముఖ కంపెనీకి చెందిన ట్రాన్స్‌పోర్టు కార్యాలయం కూడా ఉంది. కొంత ఆంజనేయ స్వామి ఆలయం వారు ఆక్రమించారు. సర్వే నెంబరు 568లోని 47 సెంట్లలో 30 సెంట్ల మేర ఆక్రమణల పాలైంది. ఈ స్థలం విలువ మార్కెట్ ధరల ప్రకారం రూ.6 కోట్లకు పైగానే ఉంటుంది. ఇటీవల ఓ వెంచర్ యజమాని దాదాపు 10 సెంట్ల మేర కాలువను పూడ్చి చదును చేసి తన వెంచరుకు రహదారిగా మార్చివేశాడు. ఇంత జరిగినా మున్సిపల్ సచివాలయ సిబ్బంది, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అటువైపు తొంగిచూడలేదు.

22 సెంట్ల స్థలం రోడ్డుగా వినియోగం

సరిగ్గా టూటౌన్ పోలీసు స్టేషను ఎదురుగా ఉన్న 564 సర్వేనెంబరు కాలువ దాదాపు 22 సెంట్లు పూర్తిగా అన్యాక్రాంతం అయింది. దీనిని ప్రైవేటులేఅవుట్‌కు రోడ్డుగా మార్చివేశారు. అయినా మున్సిపాలిటీ అధికారులు దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని విలువ మార్కెట్‌లో రూ.5 కోట్ల పైమాటే.

అలాగే.. మోడమీది పల్లె పొలం సర్వేనెంబరు 559లో 88 సెంట్లు, 572లో 87 సెంట్ల కాలువ సైతం చాలావరకు కబ్జా అయింది. 1.75 ఎకరాల ఈ కాలువ పట్టణంలోని మైదుకూరు రోడ్డుమీదుగా వెళుతుంది. వైసీపీ ప్రభుత్వంలో ఏకంగా ఈకాలువ మీద కశెట్టి స్కూలు ఎదురుగా రెండు గదులు నిర్మించారు. వీటిని ఓ కౌన్సిలర్ రూ.20 లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడని ఆరోపణలున్నాయి. ప్రధానంగా ఈ రెండు సర్వేనెంబర్లలో కాలువను సర్వేచేసి ఆక్రమణలు తొలగిస్తే పట్టణ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుంది. ఇప్పటికైనా అధికారులు కాలువల కబ్జాపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కాలువను ఆక్రమించి కట్టిన గది

కాలువలను పరిరక్షిస్తాం

ప్రొద్దుటూరు పట్టణం మోడమీది పల్లెలోని కాలువలు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షిస్తాం. ఈ కాలువలన్నింటిని సర్వేచేసి అక్రమ నిర్మాణాలకు మార్కింగ్ ఇస్తాం. కాలువ పూడ్చి చదును చేసిన స్థలాన్ని కాపాడతాం. టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ ఆక్రమణలపై నివేదిక కోరాం.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

పాండిచ్చేరి యూనివర్సిటీ వీసీగా ప్రకాశ్‌బాబు

- వైవీయూ వీసీగా వచ్చిన పదిరోజులకే బదిలీ

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూ వీసీ ఫణితి ప్రకాశ్‌బాబు పాండిచ్చేరి యూనివర్సిటీ వీసీగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం సెంట్రల్ యూనివర్సిటీ డైరెక్టర్ సుభాష్ చంద్ షరు ఉత్తర్వులు విడుదల చేశారు. ఫిబ్రవరి 24న వైవీయూ వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. పదిరోజులు కాకముందే బదిలీ కావడంతో యూనివర్సిటీ వర్గాలు విస్తుపోయాయి. యోగివేమన యూనివర్సిటీని అభివృద్ధిపథంలో నడింపించేందు కోసం సెంట్రల్ యూనివర్సిటీలో పనిచేసిన వీరిని కూటమి ప్రభుత్వం కసరత్తు చేసి వైవీయూ వీసీగా నియమంచింది. ఉన్నఫళంగా ఈయన బదిలీ అయ్యారు. నేడో రేపో ప్రకాశ్‌బాబు పాండిచ్చేరి యూనివర్సిటీ వీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు.



ఇన్‌చార్జి వీసీ ఎవరు?

యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా ఎవరు నియమితులవుతారు అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇతర యూనివర్సిటీ వీసీలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారా లేక వైవీయూలో అన్ని అర్హతలు ఉన్నవారికే ఇన్‌చార్జి పగ్గాలు అప్పగిస్తారా అనేది తెలియాల్సి ఉంది. ఏదిఏమైనా వైవీయూ మళ్లీ ఇన్‌చార్జి పాలనలోకే వెళ్లనుంది.

పోలీసుశాఖ ప్రతిష్ట పెంచాలి : ఎస్పీ


కడప క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో విధులు నిర్వహించి పోలీసు శాఖ ప్రతిష్ట పెంచాలని ప్రొబెషనరీ ఎస్‌ఐలకు ఎస్పీ అశోక్‌కుమార్ సూచించారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న ఏడుగురు ప్రొబెషనరీ సబ్‌ఇన్‌స్పెక్టర్లను కడపకు కేటాయించారు. వీరు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పోలీసుశాఖలో కొత్తగా చేరుతున్న రేనాటి శివనాగిరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్, ప్రణయ్‌కుమార్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, నాగకీర్తన, సుబహాన్‌లకు ఎస్పీ అభినందనలు తెలిపారు. నిష్పక్షపాతంగా అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లాకు రిపోర్టు చేసిన పీఎస్‌ఐలతో వారి చదువు నేపథ్యం, శిక్షణ ఏ విధంగా సాగిందీ శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు.



నూతనంగా వచ్చిన ఏడుగురు పీఎస్‌ఐలతో ఎస్పీ అశోక్‌కుమార్

ఇళ్ల నిర్మాణంలో రూ.700 కోట్లు స్వాహా చేసిన రాచమల్లు

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పేదల ఇళ్ల నిర్మాణంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి రూ.700 కోట్లు స్వాహా చేశారని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం శాసనసభ సమావేశాల్లో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో పేదలకు గృహ నిర్మాణం కోసం చేపట్టిన స్థల సేకరణలో రాచమల్లు భారీ అవినీతికి పాల్పడ్డారన్నారు. రైతుల నుంచి ఎకరం రూ.20 లక్షలకు కొని ప్రభుత్వానికి రూ.43 లక్షలకు అమ్మారన్నారు. ఇళ్ల నిర్మాణంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరిపినా ఉపయోగం లేదని నామమాత్రంగా ఆర్‌ఐని, వర్క్‌ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేశారని తెలిపారు. 13,468 ఇళ్లు నిర్మించినట్లు చెప్పి 75 శాతం డబ్బులు మాజీ ఎమ్మెల్యే తినివేశాడని, ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులు ఇచ్చిన రూ.35 వేలను కాంట్రాక్టర్లు స్వాహా చేశారని అన్నారు. ఓటర్ లిస్టును పక్కనపెట్టుకుని లబ్ధిదారుల పేర్లను రాశారని, ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం పేదలకు ఇళ్లు ఇస్తున్నాయని, ఇంతమంది లబ్ధిదారులు ఎక్కడి నుంచి వచ్చారని ప్రశ్నించారు. పేదల ఇళ్ల నిర్మాణంపై విచారణ జరిపి కాంట్రాక్టర్లపైన, లబ్ధిదారుల డబ్బు స్వాహా చేసినవారిపైన ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రిపుల్‌ఐటీ ఆడిటోరియం పూర్తిచేయండి

- మండలిలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

వేంపల్లె/పులివెందుల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఆగిపోయిన ఆడిటోరియం పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటటీ సమస్య గురంచి ఆయన ప్రస్తావించారు. రూ.40కోట్లతో ఆడిటోరియం నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే వదిలేశారని అన్నారు. సుమారు రూ.10కోట్ల మేర పనులు జరిగాయన్నారు. విద్యార్థులకు ఆడిటోరియం ఎంతో అవసరమని దీనిని పూర్తిచేసేందుకు సంబంధిత మంత్రి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ కళాశాలల్లో ఆత్మహత్యలు ఎక్కువయ్యాయని, ఒత్తిడి కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. ప్రతి కళాశాలలో విద్యార్థులను చైతన్యపరిచేందుకు సైకాలజిస్టులను ఏర్పాటుచేసి తరచూ కౌన్సెలింగ్ ఇప్పించాలని, ఒత్తిడిలేని విద్యాబోధన చేయాలని ఆయన మండలిలో విజ్ఞప్తి చేశారు. ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ ఒక్క విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నా బాధాకరమేనని, ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు.

హోమియోపతి కాలేజీలో ఖాళీలు భర్తీ చేయండి

- అసెంబ్లీలో కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి

కడప, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కడప హోమియోపతి కాలేజీలో ఖాళీలను భర్తీ చేయాలని ఎమ్మెల్యే ఆర్.మాధవి కోరారు. ఈ మేరకు ఆమె గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. హోమియోపతి కాలేజీలో టీచింగ్, నాన్‌టీచింగ్‌కు సంబంధించి 70 మందికి గాను కేవలం 30 మంది మాత్రమే పనిచేస్తున్నారని అన్నారు. 40 పోస్టులు ఖాళీగా ఉన్నాయని దీని వల్ల ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదన్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్‌ను భర్తీ చేయాలని కోరారు. అలాగే రిమ్స్‌లో హోమియోపతి కళాశాల కోసం 50 సెంట్ల స్థలం, కార్యాలయ నిర్మాణానికి రూ.4కోట్లు కేటాయించారన్నారు. ఇప్పటికీ భవన నిర్మాణం జరగలేదన్నారు. హోమియోపతి భవన నిర్మాణానికి అవసరమైన రూ.4 కోట్లు మంజూరు చేయాలని ఆమె కోరారు.

ఎంఎస్‌ఎంఈల సాధికారతతో ఆర్థిక పరిపుష్టి



మెగా చెక్కును లబ్ధిదారులకు అందిస్తున్న కలెక్టర్ శ్రీధర్, ఎంఎస్‌ఎంఈ జీఎం సుధాకర్, యూనియన్ బ్యాంకు రీజనల్ మేనేజర్ లక్ష్మీతులసి తదితరులు

కడప ఎన్జీఆర్ సర్కిల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) సాధికారతతోనే దేశ సామాజిక, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అవుతుందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. గురువారం కడపలో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా ఎంఎస్‌ఎంఈ ఔట్‌రీచ్ క్యాంప్ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడప యూనియన్ బ్యాంకు ఎంఎస్‌ఎంఈల కోసం ప్రత్యేక ఔట్ రీచ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు వేదికగా యూనియన్ బ్యాంకు ముదుకు వెళుతోందన్నారు. ఎంఎస్‌ఎంఈ జీఎం సుధాకర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు సెక్యూరిటీ లేకుండా సుమారు రూ.5కోట్ల రుణాలను యూనియన్ బ్యాంకు ఇస్తోందన్నారు. ముఖ్యంగా నారీ శక్తి, యువశక్తి వంటి ఔట్‌రీచ్ యాక్టివిటీ రుణాలను, చేనేత సంఘాలకు ముద్ర లోన్లు, బీసీ వర్గాలకు పీఎం విశ్వకర్మ రుణాలను అందిస్తోన్న సంస్థ యూనియన్ బ్యాంకు మాత్రమే అన్నారు. కడప రీజనల్ మేనేజర్ లక్ష్మీతులసి మాట్లాడుతూ కడప రీజియన్ పరిధిలో 48 బ్రాంచులతో యూనియన్ బ్యాంకు బ్యాంకింగ్ సేవల్లో విస్తృతమైన సేవలు అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో 400 మంది ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు మంజూరైన రూ.20కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 200 గ్రూపులకు చెందిన రూ.12కోట్ల రుణాలకు సంబంధించి మెగా చెక్కులను అందించారు. చేనేత రుణాలకు మంజూరుచేసిన కోటి రూపాయలు, బీసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రూ.6.12కోట్లు లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ, మెప్మా, ఐసీడీఎస్ పీడీలు ఆనంద్‌నాయక్, కిరణ్‌కుమార్ తదితర అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోదండరామాలయంలో మహాసంప్రోక్షణ



వేదపండితులు నిర్వహిస్తున్న మహా సంప్రోక్షణ

రాజంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామాలయంలో మహా సంప్రోక్షణ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ వేదపండితులు శాస్త్రోక్తంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సంప్రోక్షణలో రెండోరోజు గురువారం వేద పండితులు ఉదయం నుంచే భగవత్ పుణ్యాహవచనం, అగ్నిమదనం, యాగశాలలో వైదిక కార్యక్రమాలు, మహా కుంభ కార్యక్రమాలు నిర్వహించారు. ఉప కుంభ, పరివార కుంభారాధనలు, హోమాలు, మన్మోహనశాంతి హోమం, పూర్ణాహితు అర్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుదామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు హాలు నుంచి ఆకాంక్ష జిల్లాల ఆశయ సాధన, కార్యాచరణ ప్రగతిపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం నుంచి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డాక్టర్ సచిన్ మిట్టల్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా కొన్ని జిల్లాలను ఆకాంక్ష జిల్లాలుగా ఎంపిక చేసిందన్నారు. ఆ జిల్లాల్లో సామాజిక స్థాయిని, ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. అనంతరం జిల్లాలో చేపడుతున్న ప్రగతిపై పీపీటీ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ డాక్టర్ సచిన్ మిట్టల్‌కు వివరించారు. రాబోయే ఐదేళ్లలో మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందిస్తామని, స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని వివరించారు.

'పోసాని' పిటిషన్లపై విచారణ నేటికి వాయిదా

కడప, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌పై సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళి చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి ఓబులవారిపల్లెలో పోలీసులు కేసు నమోదు చేయడంతో పాటు ఆయనను అరెస్టు చేశారు. బెయిలు కోసం పోసాని తరపు లాయర్లు, కస్టడీ కోసం ఓబులవారిపల్లె పోలీసులు కడపలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండింటిపై విచారణను కడప మొబైల్ కోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది.

వేంపల్లె పంచాయతీలో రూ.1.88 కోట్లు దుర్వినియోగం

- ఈవో సస్పెన్షన్
- ఇద్దరు కాంట్రాక్టు వర్కర్లు తొలగింపు
- హోల్డ్‌లో సర్పంచు చెక్‌పవర్
- జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు

కడప, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో రూ.1,88,70,213 దుర్వినియోగం అయినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నిధుల దుర్వినియోగంపై వేంపల్లె ఈవోపై సస్పెండ్ వేటు వేయగా ఇద్దరు కాంట్రాక్టు వర్కర్లను తొలగించి సర్పంచు చెక్‌పవర్‌ను హోల్డ్‌లో ఉంచారు. వివరాలు ఇలా.. వేంపల్లె గ్రామ పంచాయతీలో అవినీతి జరుగుతోందని, నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ విచారణకు ఆదేశించగా డీపీవో రాజ్యలక్ష్మి, జమ్మలమడుగు డీఎల్‌పీవో తిమ్మక్క ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేశారు. ఈవోగా ఎన్వీ సుబ్బారెడ్డి పనిచేసిన 10 జూన్ 2023 నుంచి 20 జనవరి 2025 వరకు ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకుని తనిఖీ చేశారు. జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి రూ.1,88,70,213 దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేల్చారు. ఈ మేరకు విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపగా ఆయన కమిషనర్‌కు పంపించారు. పంచాయతీరాజ్ నిబంధనలను ఉల్లంఘించి చేసిన తప్పునకు ఈఓ ఎన్వీ సుబ్బారెడ్డిని సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే ఈ నిధుల దుర్వినియోగంలో భాగస్వాములైన కాంట్రాక్టు వర్కర్లు వంశీ, ఖాజాలను విధుల నుంచి తొలగించారు. ఇన్‌చార్జి సర్పంచుగా ఉన్న ఆర్.శ్రీనివాసులు చెక్‌పవర్‌ను హోల్డ్‌లో ఉంచారు. నిధుల దుర్వినియోగం జరుగుతుంటే నిర్లక్ష్యంగా ఉన్నందుకు చెక్‌పవర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో వారంలోపు సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. కాగా సస్పెండ్ అయిన సుబ్బారెడ్డి వేంపల్లె హెడ్‌క్వార్టర్ దాటి వెళ్లకూడదని, అవసరమైతే అధికారుల అనుమతి తీసుకుని వెళ్లాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అందరిదీ అదేదారి..!

గతంలో ఇక్కడ ఈవోగా పనిచేసిన రవిశంకర్ రెడ్డి ప్రస్తుతం పోరుమామిళ్లలో పనిచేస్తున్నారు. ఆయన ఏడాది పాటు రూ.51లక్షలను తనవద్దే ఉంచుకున్నట్లు విచారణలో బయటపడింది. అంతకుముందు ఈవోగా పనిచేసిన బీవీఎస్ మల్లికార్జునరెడ్డి ప్రస్తుతం వేంపల్లె ఈఓపీఆర్డీగా పనిచేస్తున్నారు. రూ.15.67లక్షలు రెండు సంవత్సరాలుగా తనవద్దే ఉంచుకున్నట్లు విచారణలో తేల్చారు. ఈవో సుబ్బారెడ్డిని సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు ఈ ఇద్దరు ఈవోలపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటి అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.





వేంపల్లె మేజర్ పంచాయతీ కార్యాలయం

దిగుబడి ఉన్నపుడు ధర ఉండకపోవడం.. ధర ఉన్నపుడు దిగుబడులు లేకపోవడం సాధారణంగా రైతులు ఎదుర్కొనే సమస్య. అయితే, ఈ ఏడాది రైల్వే కోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా నిమ్మ దిగుబడులు అధికంగా ఉండగా, అదే సమయంలో ధర కూడా ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



నిమ్మ ధరలు పైపైకి..

- ఈ ఏడాది ఆశాజనకంగా దిగుబడులు
- 50 కిలోల బస్తా రూ. 2000 దాకా..
- ఇంకా పెరిగే అవకాశం

రైల్వేకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిమ్మ సాగులో రైల్వేకోడూరు నియోజకవర్గం దక్షిణ భారతదేశంలోనే పేరు పొందింది. గతంలో ఇక్కడి నుంచి కేరళలోని ఎర్నాకుళం, తిరుచూరు, మహారాష్ట్రలోని ముంబై, కర్ణాటక రాష్ట్రంలోని హాస్పేట్ తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచి నిమ్మకాయలు ఎగుమతి అయ్యేవి. చిన్నచిన్న వ్యాపారులు తిరుపతి, రాజంపేట, కడప, అనంతపురం, చిత్తూరు తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారు. 2000-03 మధ్య కాలంలో ఈ ప్రాంతంలో తీవ్రమైన కరువు కారణంగా నిమ్మతోటలు ఎండిపోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. 2015-17 మధ్యకాలంలో దిగుబడి అధికంగా వచ్చినా ధర లేకపోవడంతో పెట్టుబడులు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత ఏడాది అదును తప్పి కాపు రావడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. అప్పట్లో ప్రతిరోజు 200 బస్తాల దాకా మాత్రమే ఎగుమతి అయ్యాయి. ప్రస్తుతం 400 బస్తాలు ఒక్క ఎర్నాకుళంకే వెళుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది కాపు బాగా ఉండగా, అందుకు తగినట్లు డిమాండు కూడా ఉందని వ్యాపారులు అంటున్నారు. ప్రస్తుతం మొదటి రకం నిమ్మ కాయలు 50 కిలోల బస్తా రూ.1500 నుంచి రూ.2000 వరకు ధర పలుకుతోంది. మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ధర బాగుంది



ధరలు బాగా ఉన్న సమయంలో దిగుబడి లేక పోవడం, దిగుబడి ఉన్న సమయంలో ధర లేక ఇబ్బంది లు పడేవాళ్లం. ప్రస్తుతం నిమ్మ కాయలకు డిమాండు బాగా ఉంది. దిగుబడి కూడా బాగానే ఉంది.

- మలిశెట్టి మాధవయ్య, రైతు, వెంకటరాజుపల్లె

పది రూపాయలకు రెండు కాయలు

పట్టణంలో రెండు నిమ్మకాయలను రూ. 10కి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో డిమాండు పెరిగింది. తోటల వద్దే పచ్చికాయలు కూడా అమ్మేస్తుండడంతో పండ్లు దొరకడం కష్టంగామారిందని వినియోగదారులు అంటున్నారు.



నిమ్మకాయలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

సెంటు భూమి కూడా వదలం..

- నల్లారి చొరవతోనే ఆక్రమణలపై విచారణ
- ఆక్రమణదారులపై కఠిన చర్యలు
- పీలేరులో కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమీక్ష సమావేశంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

పీలేరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పోరాటాల ఫలితంగానే పునఃప్రారంభమైందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. 'సర్కారీ భూములు స్వాహా, నాడు చెరపట్టిన వైసీపీ నేతలు' అన్న శీర్షికతో పీలేరు మండలంలో భూఆక్రమణలపై ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ విషయంపై గురువారం ఆయన పీలేరులో మాట్లాడారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పేర్కొన్న ఆక్రమణల జాబితాలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో పేర్కొన్న పలు సర్వే నెంబర్లు ఉండడంతో ఇప్పటికే కొన్నింటిని తొలగించామని, మరికొన్ని సర్వే నెంబర్లపై విచారణకు స్థానిక అధికారులను ఆదేశించామన్నారు. ఆక్రమణదారుల చెరలో ఉన్న చివరి సెంటు ప్రభుత్వ భూమిని విడిపించే వరకు విశ్రమించబోమన్నారు. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి గతంలో చేసిన ఫిర్యాదు, మదనపల్లె పూర్వ సబ్-కలెక్టర్ జాహ్నవి నివేదిక మేరకు పీలేరు మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో 600 ఎకరాల అవకతవకలపై విచారణకు 10 బృందాలను నియమించామని తెలిపారు. గడిచిన ఐదురోజుల్లో సుమారు 338 ఎకరాల మేరకు విచారణ పూర్తి చేశాయన్నారు. మరో నాలుగు రోజుల్లో విచారణ పూర్తి చేస్తాయని, ఆ తరువాత చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం విచారణ పురోగతిపై సమీక్షించారు.

నేనూ భూ ఆక్రమణల బాధితుడినే...

సాధారణ మధ్య తరగతి కుటుంబానికి చెందిన తాను కూడాఆక్రమణదారుల బారిన పడి ఇబ్బంది పడిన వాడినేనని కలెక్టర్ తెలిపారు. తన చెల్లి పెళ్లి సందర్భంగా ఎంతో కష్టపడి కూడబెట్టిన రూ.4 లక్షలతో తన తల్లిదండ్రులు ఒక ఇంటి స్థలం కొనుగోలు చేశారన్నారు. అయితే ఆ స్థలాన్ని తమకు అమ్మిన రియల్టర్ ఆ స్థలం ఒక సర్వే నెంబరులో ఉంటే మరో సర్వే నెంబరు వేసి రిజిస్టరు చేసి ఇచ్చాడన్నారు. నాలుగేళ్ల తరువాత అతని మోసం బయటపడిందన్నారు. తాము గట్టిగా ఎదిరిస్తే 50 శాతం సొమ్ము వాపసు చేశాడన్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు డీకేటీ, ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనుగోలు చేసి మోసపోతున్నారని వాపోయారు. ప్రభుత్వ, డీకేటీ స్థలాలను స్పష్టంగా చూపించే యాప్‌గానీ, వెబ్‌సైట్ గానీ రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు.

పీలేరు అధికారుల పనితీరు మెరుగుపడింది...

పీలేరు మండలంలో పనిచేస్తున్న రెవెన్యూ అధికారుల పనితీరు రెండు నెలల వ్యవధిలో గణనీయంగా పెరిగిందన్నారు. ఆర్‌టీజీఎస్ ద్వారా మండలంలో 550 అర్జీలు అందగా వాటిలో 500 అర్జీలు పరిష్కరించామన్నారు. రీసర్వేలో అందిన దరఖాస్తుల్లోనూ కేవలం 80 మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తహసీల్దారు భీమేశ్వరరావు పాల్గొన్నారు.

స్కూలు వ్యాను ఢీకొని ఒకరు మృతి



సంఘటనా స్థలంలో బాలయ్య మృతదేహం

పుల్లంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : స్కూలువ్యాను బైకును ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు ఓబులవారిపల్లె మండలం పి.కమ్మపల్లె హరిజనవాడకు చెందిన బత్తల బాలయ్య(64) మాలేపాటి రమణయ్య బైకుపై వస్తుండగా రాజంపేటలోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన స్కూలు వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు గాయపడగా హుటాహుటిన 108లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలయ్యను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

అతిగా మద్యం సేవించి..

పెద్దతిప్పసముద్రం మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు .. మల్లెల పంచాయతీ గొందిపల్లెకు చెందిన చౌడిరెడ్డి (55) రైతు. బుధవారం అధిక మోతాదులో మద్యం సేవించి ఇంట్లో నిద్రపోయాడు. గురువారం ఉదయం ఎంతసేపటికి నిద్ర లేవక పోవడంతో భార్య వెళ్లి పరిశీలించగా, మృతిచెందినట్లు తేలింది. మృతునికి భార్య సరోజమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

తండ్రిపై కొడుకు దాడి



చికిత్స పొందుతున్న ఖాదర్‌హుస్సేన్

సిద్దవటం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కన్న కొడుకే తండ్రిపై బండరాయితో దాడి చేసిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన ఖాదర్ హుస్సేన్‌కు అతని కుమారుడు బాబాఫకృద్దీన్ మధ్య తమ ఇంటిని అద్దెకు ఇచ్చే విషయంలో బుధవారం సాయంత్రం ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహించిన కొడుకు బండ రాయితో దాడి చేయగా, తీవ్రంగా గాయపడిన తండ్రి కుప్పకూలి పో యాడు. స్థానికులు అతనిని ఒంటిమిట్టలోని ప్రభుత్వ ఆస్పత్రికి తర లించగా, ప్రాథమిక చికిత్స అనంతరం రిమ్స్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆస్తి కోసమే తన కుమారుడు దాడి చేశాడని బాధితుడు తెలిపాడు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు..

నిమ్మనపల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు సోమల మండలం తుమ్మినాయునిపల్లి పంచాయతీ కురవపల్లికి చెందిన శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై నిమ్మనపల్లి రోడ్డు మీదుగా మదనపల్లి వైపు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మారుతి కారు ఢీకొని వెళ్లిపోయింది. దీంతో శ్రీనివాసులు కాలు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడి బావమరిది మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

ప్రధాన రహదారిపై నల్లటి రసాయనం

- ఇబ్బంది పడిన ప్రయాణికులు
- స్పందించిన అధికారులు



రహదారిపై పడిన పౌడర్‌ను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారి పై ఉన్న తపాలా కార్యాలయం సమీపంలో నల్లటి పౌడర్‌తో కూడిన బ్యాగ్ రోడ్డుకు అండగా పడడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. బుధవారం అర్ధరాత్రి చెన్నై నుంచి తాడిపత్రికి వెళుతున్న లారీ నుంచి ఈ బ్యాగ్ జారిపడింది. విషయం తెలుసుకున్న లారీ డ్రైవర్ జేసీబీ సాయంతో దానిని తిరిగి లారీలో లోడ్ చేయిస్తుండగా జారిపడి పగిలిపోయింది. దీంతో అందులోని పౌడర్ రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయింది. దీంతో లారీ డ్రైవర్ పరారయ్యాడు. గురువారం ఉదయం పంచాయతీ అధికారులు నీళ్లతో రోడ్డును శుభ్రం చేశారు.

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడి మృతి



అధికారులతో వాగ్వాదం చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

ఎర్రగుంట్ల, మార్చి 6 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీపీపీ పాత కోల్ ప్లాం టులో పనిచేస్తున్న కార్మికుడు హఠాత్తుగా మృతి చెందాడు. .తాడిపత్రికి చెందిన నాగరాజు(40)గురు వారం సాయంత్రం విధి నిర్వహణలో ఉన్న పళంగా కుప్పకూలడంతో అతనిని ప్లాంటు ఆసు పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం తరలిస్తుండగా మధ్యలో మృతిచెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే మృతికి కారణమంటూ మృతుడి భార్య, బంధువులు ధర్నాకు దిగారు. మృతుడి భార్యకు ఉద్యోగంతో పాటు, ఆర్థిక సహాయం కూడా చేసేందుకు అధికారులు ఒప్పుకోవడంతో వారు ధర్నా విరమించారు.

మహిళా సాధికారతకు కృషి చేద్దాం

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో విద్యార్థినులతో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు అన్నమయ్య జిల్లాలో పోలీసుల ఆధ్వర్యంలో మహిళా సాధికారత వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో మహిళల భద్రత, పోలీసు విధులపై విద్యార్థినులకు అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా బాలికలకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించామని, మరింత అవగాహన కోసం ర్యాలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 8న జిల్లా కేంద్రంలో మహిళా, శిశు సంక్షేమశాఖతో పాటు ఇతర శాఖల సహకారంతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతి ప్రధానం చేస్తామని వివరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థినులకు పోలీసులు ఉపయో గిస్తున్న అత్యాధునిక ఆయుధాలు, బాంబ్ డిస్పోజల్స్ పరికరాలు, సాంకేతికత విజ్ఞానంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థినులు జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్, అదనపు ఎస్పీ చాంబర్‌తో పాటు వివిధ విభాగాల కార్యాలయాలను సందర్శించారు. పోలీసుశాఖపై ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకటాద్రి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఆర్‌ఐలు, వీజే రామకృష్ణ, పెద్దయ్య, ఏఆర్, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది, వివిధ పాఠశాలల అధ్యాపకులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'అనర్హులకే ఇళ్లపట్టాలు'పై విచారణ

- ఎనిమిది మంది సభ్యులతో కమిటీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సీటీఎం లేఅవుట్‌లో విచారణ చేస్తున్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అనర్హులకే ఇళ్లపట్టాలు..అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశాలతో తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో సీటీఎం-2 గ్రామం సర్వేనెంబర్ 779/2 లేఅవుట్‌లో విచారణ ప్రారంభించారు. నలుగురు వీఆర్‌ఓలు, నలుగురు విలేజ్ సర్వేయర్ల బృందాలు విడివిడిగా ప్రతి ఇంటి స్థలం వద్దకు వెళ్లి లబ్ధిదారుడి వివరాలు ఆరా తీస్తున్నారు. లబ్ధిదారుడి వద్ద వున్న ఇంటి పట్టా, తహసీల్దార్ కార్యాలంలోని ఒరిజినల్ రిజిస్టర్‌లో వున్న జాబితాతో సరిపోలుస్తున్నారు. దీంతో పాటు నకిలీ పట్టాల విషయంలో అణువణువూ తనిఖీ చేస్తున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ అనర్హులకు ఇళ్లపట్టాల మంజూరుపై క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, నిదానమైనా నిక్కచ్చిగా విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామన్నారు. కాగా ఈ లేఅవుట్‌లో ఇంటి పట్టాలు కొనుగోలు చేసిన అమాయకుడు తాము మోసపోయామని లబోదిబో మంటున్నారు. కొందరేమో తాము డబ్బు ఇచ్చిన దళారుల వద్దకు వెళ్లి గోడు వెళ్లబోసుకుంటున్నారు.

కడుపు ఎండగడుతున్న క్వారీలు..

- ఆవేదన వ్యక్తం చేసిన స్థానికులు
- తూతూ మంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ
- హాజరైన వారికి రూ.500 తాయిలం



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్,



డబ్బు పంచుతున్న క్వారీ ప్రతినిధులు

మదనపల్లె టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): క్వారీల కారణంగా తమ కడుపులు ఎండుతున్నాయని, క్వారీల ఏర్పాటుకు ముందు ఒక విధంగా, తర్వాత మరో విధంగా యాజమాన్యాలు ప్రవర్తిస్తున్నాయని మదనపల్లె మండలం కోటవారుపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లె ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, కడప పొల్యూషన్ కంట్రోల్ ఇంజనీర్ కె.సుధ, తహసీల్దార్ ధనంజయులు ఆధ్వర్యంలో గురువారం కలర్ గ్రానైట్ క్వారీయింగ్‌కు అనుమతించేందుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. క్వారీ ఏర్పాటుపై అభ్యంతరాలు తెలపాలని సబ్‌కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇప్పటికే ఇక్కడ 12 క్వారీలకు తాము అభ్యంతరం తెలపలేదని, కాని క్వారీ యజమానులు ప్రజాభిప్రాయ సేకరణ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదని ఆరోపిరు. ఈ క్వారీల చుట్టుపక్కల పంట పొలాలు దుమ్ము, ధూళితో నిండిపోయి, బోర్లు ఎండిపోతున్నాయన్నారు. పర్యావరణవేత్తలుగా చెప్పుకున్న ఎన్‌జీఓలు క్వారీ అనుమతికి అభ్యంతరం లేదని చెప్పేశారు. దీనిపై సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు చెప్పిన అభ్యంతరాలు, ఎన్‌జీఓల అభిప్రాయాలను రికార్డు చేసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు పంపుతామన్నారు. సమావేశం పూర్తి కాగానే ఈ క్వారీ చుట్టుపక్కల గ్రామాలైన బండకిందపల్లె, ఉడుంవారిపల్లె, కోటవారుపల్లె, కొత్తపల్లె గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు క్వారీ నిర్వాహకులు అన్నం పొట్లాలు ఇచ్చి ఒక్కొక్కరికి రూ.500 చొప్పున పంచిపెట్టారు. ఈ విషయంపై కోటవారుపల్లె సర్పంచ్ నారాయణస్వామి మాట్లాడుతూ ఈ నాలుగు పల్లెల్లో సమావేశం గురించి దండోరా వేశారని, ప్రజలందరూ స్వచ్ఛందంగానే వచ్చారన్నారు. అన్నం, డబ్బు తీసుకోవడానికి ప్రజలు అలవాటు పడిపోయారన్నారు. కార్యక్రమంలో కొత్తపల్లె ఉపసర్పంచ్ ఎన్. నంద కుమార్, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

నాటు బాంబు పేలి ఆవుకు గాయాలు



నాటు బాంబు పేలడంతో గాయపడిన పాడి ఆవు

గుర్రంకొండ, మార్చి 6(ఆంధ్ర జ్యోతి):అడవి పందుల కోసం వేటగాళ్లు అమర్చిన నాటు బాంబును కొరకడంతో పాడి ఆవు తీవ్రంగా గాయపడింది. ఆవు యజమాని నాగరాజ తెలి పిన వివరాల మేరకు మండలంలోని సంగసముద్రం పంచాయతీ మామిళ్ల వారిపల్లెకు చెందిన డి. నాగరాజ, రేవతి దంపతులు పాడి ఆవులను పోషిస్తుంటారు. గురువారం మేత కోసం పొలంలో వదిలిన సమయంలో ఒక ఆవు వేటగాళ్లు అమర్చిన నాటుబాంబు ను కొరికింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో నాగరాజ దంపతులు పరుగెత్తి చూడగా ఆవు నోటి భాగం తీవ్రంగా గాయపడి కనిపించింది. గాయపడిన పాడి ఆవు విలువ రూ.85 వేలు ఉంటుం దని నాగరాజు తెలిపారు. తమ పొలంలో నాటు బాంబు అమర్చిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి బాధ్యులైన వారిపై చర్యలు తీసు కుంటామని ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.


వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్పీఓ నాగరాజు

తంబళ్లపల్లె, మార్చి 6(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో నాగరాజు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన మండలంలోని కుక్కరాజుపల్లె, కన్నెమడుగు, తంబళ్లపల్లె సచివాలయాలతో పాటు డంపింగ్‌యార్డులను తనిఖీ చేశారు. పలు చోట్ల డంపింగ్‌యార్డుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయాల్లో ఉద్యోగుల హాజరు పట్టి, రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉపేంద్ర రెడ్డితో కలసి సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తలుగా వేరుచేసి బృందావనాల్లో వర్మీ కంపోస్టు తయారుచేయాలన్నారు. గ్రామాల్లో నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగం కాకుండా సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో కృషి చేసి సంపద సృష్టించాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధి లైట్లు తదితర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. ఆయన వెంట ఈవోఆర్డీ దిలీప్‌కుమార్‌నాయక్, కార్యదర్శి రమణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పురాతన రాతి విగ్రహం లభ్యం



వెంకటేశ్వరస్వామి విగ్రహం

రైల్వేకోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిగుంట గ్రామం గిరిజన కాలనీకి సమీపంలో గురువారం కొన్ని వందల ఏళ్ల క్రితం నాటి వెంకటేశ్వరస్వామి విగ్రహం వెలుగుచూసింది. శెట్టిగుంట సమీపంలోనే ఉన్న శేషాచలం అడవుల్లో ఆది మానవుల సంచారం ఆనవాళ్లు, శిలాజాలు లభ్యమైన నేపథ్యంలోనే ఈ విగ్రహం కూడా బయట పడిందని గ్రామస్తులు నాగినేని వెంకటరమణ, చంద్ర తదితరులు తెలిపారు. మట్టిలో పూడుకుపోయి కనిపించిన ఈ విగ్రహాన్ని గ్రామస్తులు ఒక చోట నిలుచోబెట్టారు.

మున్సిపల్ అధికారులపై చర్యలకు సిఫారసు

రాజంపేట, మార్చి 6(ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజంపేట మున్సిపల్ పరిపాలన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సిపారసు చేశారు. వివరాలు ఇవీ.. 2022 ఆగస్టు 4న అప్పటి మున్సిపల్ పరిపాలనాధికారులపై వచ్చిన ఆరోపణలపై అప్పటి ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా రాజంపేట పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం, వారికి ప్రణాళికా అధికారులు సహకరించడం, పన్నుల విషయంలో అవినీతి ఆరోపణలు రావడం తదితర అంశాలపై వారు గుర్తించారు. ఈ అంశాలపై చాలా రోజులుగా విచారణ సాగుతోంది. అయితే ఈ నెల 6న అందుకు సంబంధించిన నాటి మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారిణి లక్ష్మీ నారాయణమ్మ, మేనేజర్ శేషఫణి, సీనియర్ అసిస్టెంట్లు హరినాథ్, వెంకటమధుసూదన్, బిల్ కలెక్టర్ వెంకటరామకృష్ణ, జమాల్ అహ్మద్ తదితరులు అవినీతి ఆరోపణలకు పాల్పడినందున చర్యలు తీసుకోవాలని ఏసీబీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన ప్రతులు అందాయి.

'మహిళా శిశు సంక్షేమం' అధికారిగా అనూరాధ

కలికిరి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిత అధికారిగా పి.అనూరాధను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా ఫిరంగిపురం ఐసీడీఎస్‌లో ఏసీడీపీఓగా పనిచేస్తున్న అనూరాధను డిప్యుటేషన్‌పై జిల్లాలో నియమిస్తూ ఆ శాఖ రాష్ట్ర కార్యదర్శి ఎ.సూర్యకుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు

కుట్టు పనులతో మహిళలకు ఉపాధి

- 2015-16లో తొమ్మిది మండలాల్లో శిక్షణ
- మహిళా దినోత్సవం సందర్భంగా మళ్లీ ఇన్నాళ్లకు..




కుట్టు శిక్షణను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సంబేపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ స్వశక్తితో ఎదగాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం. మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించడంలో భాగంగా డ్వాక్రా సంఘాల ద్వారా స్వయం ఉపాధి మార్గాలను కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా 2015-16లో ఉమ్మడి కడప జిల్లాలోని 9 మండలాల్లో మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి వారికి సబ్సిడీతో కుట్టు మెషీన్లను అందించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా దినోత్సవం సందర్భంగా మళ్లీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది.

కుట్టు శిక్షణ ఇచ్చిన మండలాలు ఇవే..

2015-16లో సంబేపల్లె, నందలూరు, పెనగలూరు, కమలాపురం, జమ్మలమడుగు, అట్లూరు, ఖాజీపేట, వేంపల్లి, ప్రొద్దుటూరు మండలాల్లో డ్వాక్రా సంఘాల సభ్యులకు ఒక్కో విడతలో 30 మందికి చొప్పున కుట్టు శిక్షణ ఇప్పించారు. అప్పట్లో సంబేపల్లె మండలంలో ఒక్కో బ్యాచ్‌కు రూ.17,550 చొప్పున ఖర్చు చేసి మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు వెలుగు ఏపీఎం సంజీవరాజు తెలిపారు.. ఇలా లో ఒక్కో మండలం నుంచి 90 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి సబ్సిడీతో కుట్టుమిషన్లను కూడా అందించినట్లు వెలుగు అధికారులు తెలిపారు. సంబేపల్లె మండలంలో అప్పట్లో కుట్టుమిషన్ల కోసం రూ.2,74, 659 ఖర్చు చేసినట్లు తెలియజేశారు.

కుటుంబ అవసరాలు తీరుతున్నాయి



2015-16లో మొదటి బ్యాచ్‌లో నేను సంబేపల్లె మండలంలో కుట్టుశిక్షణ పొందాను. సమయం దొరికినప్పుడు బట్టలు కుట్టడంతో ఇంటి అవసరాలకు చాలినంత ఆదాయం వస్తోంది. పండుగల సమయంలో మంచి గిరాకీ ఉంటుంది.

- జల్లా పరమేశ్వరి, ప్రకాశ్‌నగర్‌కాలనీ, సంబేపల్లె

ఉపాధ్యాయ బదిలీల్లో అక్రమాలకు అడ్డుకట్ట

- కొత్తచట్టం రూపొందిస్తున్న కూటమి ప్రభుత్వం
- ముసాయిదా విడుదల
- నేటితో ముగియనున్న అభ్యంతరాల స్వీకరణ

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను క్రమబద్ధం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఉపాధ్యాయుల బదిలీ చట్టం రూపకల్పనకు ఇటీవల ముసాయిదా విడుదల చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలు ఇష్టానుసారంగా జరిగాయి. సాధారణంగా కౌన్సెలింగ్ పద్ధతి ప్రకారం కాకుండా సిఫారసుల ఆధారంగా బదిలీలు సాగేవి. ఇటువంటి అక్రమాలకు తావులేకుండా ఏటా మే 31 నాటికి బదిలీలు చేపట్టి.. పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఉపాధ్యాయులు చేరేలా ముసాయిదా సిద్ధం చేసింది.

జిల్లాలో 1620 ప్రభుత్వ ప్రాథమిక, 127 ప్రాథమికోన్నత, 236 ఉన్నత పాఠశాలలు, 64 హైస్కూల్ ప్లస్, మొత్తం 2047 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్, వివిధ భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు 7821 మంది పనిచేస్తున్నారు. 2023 జూన్‌లో సాధారణ బదిలీల్లో సుమారు 3000 మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. కాగా, బదిలీల సందర్భంగా కొంతమంది ఉపాధ్యాయులు దీర్ఘకాలిక అనారోగ్యం, దివ్యాంగులుగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలు పొంది.. వాటి ఆధారంగా ఆయా మండలాల్లోని పాఠశాలల్లో తిష్ట వేస్తున్నారు. దీంతో అర్హులైన వారికి దగ్గర ఉండే ప్లేసులు దొరకవు. షెడ్యూల్ మేరకు బదిలీలు జరుగుతాయన్న నమ్మకం కూడా ఉండదు. విద్యా సంవత్సర మధ్యలోనో, ఆఖరిలోనే ఉన్నఫలంగా బదిలీ చేస్తారు. కోర్టు కేసులవల్ల ఒక్కో జిల్లాలో ఒక్కోలా ప్రమోషన్లు సాగుతాయి. ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం రాష్ట్ర బదిలీల నియంత్రణ చట్టం-2025 అమలులోకి తెచ్చేందుకు కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటికే బదిలీల డ్రాఫ్ట్ విడుదల చేసింది. ఈనెల 7వరకు ఉపాధ్యాయుల నుంచి విద్యాశాఖ అభ్యంతరాలు స్వీకరించనుంది.

అన్ని డీఎస్సీల లెక్కలు తేలుస్తూ...

ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లకు సీనియారిటీ జాబితా ముఖ్యం. గతంలో చాలా మంది టీచర్లు తాత్కాలిక అవసరాల కోసం బదిలీలు, ప్రమోషన్లలో లబ్ధిపొందేందుకు వ్యక్తిగత సమాచారాన్ని సైతం అడ్డగోలుగా నమోదు చేసుకున్నారు. కొందరు తాము అపాయింట్ అయిన డీఎస్సీ, నియామక తేదీలు, స్కూల్ మేనేజ్‌మెంట్ వివరాలను టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టం (టీస్)లో సైతం తప్పుగా పొందుపరిచారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం టీచర్ల సీనియారిటీ జాబితాను పూర్తిగా క్రమబద్ధీకరిస్తోంది. నెల రోజులుగా ఉమ్మడి జిల్లా విద్యాశాఖ, ఐటీసెల్ అధికారులు దీనిపై కసరత్తు చేస్తున్నారు. డీఎస్సీలు 1982, 1984, 1989, 1994, 1998, 2000, 2002, 2014, 2018 టీచర్ల వివరాలు సేకరించి సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు.

చాలా సమస్యలకు పరిష్కారం

ఉపాధ్యాయుల బదిలీల నియంత్రణ చట్టం క్షేత్రస్థాయిలో అమల్లోకి వస్తే చాలా సమస్యలకు తెరపడే అవకాశం ఉంది. విద్యా సంవత్సర మధ్యలో కాకుండా వేసవి సెలవుల్లోనే బదిలీల ప్రక్రియ జరగనుం ది. బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించి భవిష్యత్‌లో సమస్య లేకుం డా శాశ్వతమైన సీనియారిటీ జాబితాను విద్యాశాఖాధికారులు సిద్ధం చేస్తున్నారు. దీంతో మెజార్టీ వర్గాలకు న్యాయం చేకూరే అవకాశాలున్నాయి. ప్రిఫరెన్షియల్ కేటగిరీ, బోగస్ దివ్యాంగ సర్టిఫికెట్లు పెట్టి లబ్ధిపొందాలనుకునే వారికి కూడా చెక్ పెట్టే అవకాశం ఉంది. రెండేళ్లు, మూడేళ్లకు బదిలీలు చేపట్టేవారు ఇకపై ఏటా నిర్వహిస్తామంటుండటం శుభపరిణామం. దీనిపై మెజార్టీ టీచర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒకరిద్దరు మాత్రం లోపాలున్నాయని చెబుతున్నారు. తమ అభిప్రాయాలు పరిగణలోకి తీసుకొని సవరించాలని కోరుతున్నారు.

అన్యాయం జరిగితే..



ఉపాధ్యాయుల బదిలీలలో అన్యాయం జరిగితే కోర్టుకు వెళ్లేందుకు అనుమతి కల్పించాలి. మూడు సంవత్సరాలలో పదవీ విరమణ పొందే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలి. 60శాతం దాటిన విభిన్న ప్రతిభావంతులదరికి ప్రిఫరెన్షియల్ కేటగిరీలో వెసులుబాటు కల్పించాలి. 117 జీఓ రద్దు వలన సర్‌ప్లస్ అయిన టీచర్లకు లాంగ్ స్టాండిగ్ పాయింట్ ఇవ్వాలి.

- రామాంజనేయులు, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి



వెబ్‌కౌన్సెలింగ్ స్థానంలో ఎస్‌జీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. పాఠశాల కేటగిరీలో ఖాళీల బ్లాకింగ్ విధానం పై, సర్వీస్ పాయింట్లు, స్పెషల్ పాయింట్లు, ప్రిఫరెన్షియల్ కేటగిరీపై మార్పులు తీసుకురావాలి. పదోన్నతులకు అన్న కేటగిరీల ఖాళీలు చూపించాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

పరిమిత ప్రయోజనమే...



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బదిలీల డ్రాఫ్టు చట్టం వల్ల ఉపాధ్యాయులలో భేదాభిప్రాయాలు ఉత్పన్నమవడం తప్ప పెద్దగా ఒరిగేదేమీ లేదు. దాదాపు ప్రస్తుతం ఉన్న 90శాతం నిబంధనల్లో పెద్దగా మార్పు లేదు. పెర్ఫార్మెన్స్ పాయింట్ల వంటి వివాదాస్పదమైన అంశాలను తొలగించాలి. జీఓ 117 రద్దు, మోడల్ పాఠశాలల ఏర్పాటు, హైస్కూల్ ప్లస్‌ల రద్దు వంటి అంశాల వల్ల రాబోయే సంవత్సరాల్లో విద్యా వ్యవస్థకు తీరని నష్టం జరుగుతుంది.

- కె.సురేష్‌బాబు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, ఎస్‌టీయూఏపీ

వీరభద్రుని ఆదాయం రూ.9.84 లక్షలు

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవాలయంలో గురువారం శాశ్వత హుండీల్లోని డబ్బులను తహసీల్దారు రమాకుమారి, జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, దేవస్థానం ఛైర్మన్ పెరుగు వీరనారాయణ ఆధ్వర్యంలో లెక్కించారు. భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా వీరభద్రస్వామికి రూ.9,25,769, భద్రకాళి అమ్మవారికి రూ.58,717 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ డబ్బులను మైదుకూరులోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేకలబాబు, గోసుల వీరారెడ్డి, వీరనారాయణ, కమిటీ సభ్యులు, పోలీసులు, గోవింద మాల సేవా మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

తలనీలాల వేలంపాట రూ.66 లక్షలు

చక్రాయపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో భక్తులు సమర్పించే తలనీలాలు పోగుచేసుకునేందుకు నిర్వహించిన వేలంలో సికింద్రాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్‌ప్రైజెస్ ప్రొప్రెయిటర్ పి.ఆదినారాయణ రూ.66లక్షలకు పాడి వేలాన్ని దక్కించుకున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం గండి కార్యాలయంలో వేలం నిర్వహించగా ఐదుగురు గుత్తేదారులలు పాల్గొన్నారన్నారు. గత ఏడాది రూ.65.11లక్షలు పలుకగా ఈ ఏడాది రూ.66లక్షలు పలికిందన్నారు. వేలం దక్కించుకున్న వారికి 01.04.2025 నుంచి 31.03.2026 వరకు హక్కు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీదారులు శివయ్య, ఆలయ మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, బ్యాంకు, పోలీసులు, ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

కృత్రిమ కాళ్ల పంపిణీని సద్వినియోగం చేసుకోండి

- వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ క్రిష్ణకిశోర్

కడప మారుతీనగర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాళ్లు విరిగిన వారికి ఈనెల 7న శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కడప కలెక్టరేట్‌లో కృత్రిమ కాళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ క్రిష్ణకిశోర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక దరఖాస్తుల స్వీకరణ స్థలంలో చెన్నైకి చెందిన ఫ్రీడం ట్రస్టు ద్వారా యాక్స్ హెల్త్ కేర్ సహకారంతో కృత్రిమ కాళ్ల పంపిణీకి అవసరమైన కొలతలను వికలాంగుల నుంచి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఒక్కో కృత్రిమ కాలు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని.. అవసరమైన వారికి ఉచితంగా అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించినట్లు వైవీయూ ప్రధాన ఆచార్యులు ఎస్.రఘునాథరెడ్డి అన్నారు. గురువారం వైవీ నా ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి.విజయభారతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలను పొందేందుకు విద్యార్థులు విశ్వవిద్యాలయంలో లభించే వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని క్యాంపస్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు. దివీస్ ల్యాబోరేటరీస్ లిమిటెడ్, శ్రీచైతన్య స్కూల్స్ ప్రతినిధులు రాత పరీక్ష ఇంటర్వ్యూ, డెమో ద్వారా వారి సంస్థలకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు. ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు రెడ్డయ్య, గణేష్‌నాయక్, డాక్టర్ కె.లలిత విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుశాఖకు జాగిలాల సేవలు అమోఘం

- జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు



పోలీసు జాగిలాలను సన్మానిస్తున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

కడప క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖకు జాగిలాలు వాఘా రూన్సీ 11 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించాయని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు కొనియాడారు. గురువారం సాయంత్రం స్థానిక పెన్నార్ పోలీసు హాలులో వాఘా, రూన్సీ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరులుగా పేరుగాంచిన లాబ్రడార్ రిట్రీవర్ జాతికి చెందిన జాగిలాలు వాఘా, రూన్సీలను అదనపు ఎస్పీ కె.ప్రకాశ్‌బాబు, అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పాటు పోలీసుశాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్లు పీరయ్య, బీవీ క్రిష్ణయ్యలను అదనపు ఎస్పీ అభినందించారు. పలు సీఎం బందోబస్తు విధులు, వీవీఐపీ, వీఐపీల విధులు, క్రిష్ణా, గోదావరి పుష్కరాల్లో, తిరుమల బ్రహ్మోత్సవాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి పలువురి ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం వాఘా, రూన్సీలను మేళతాళాలతో బాణసంచా కాల్చుతూ వాటి విడిది గృహాల వద్దకు చేర్చి ఘనంగా వీడ్కోలు పలికారు. ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు శివరాముడు, వీరేశ్, శ్రీశైల రెడ్డి, టైటస్, ఆర్ఎస్ఐలు, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ టీం, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య



మోషే (ఫైల్‌ఫొటో)

మైలవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మిరపపంటలో ఆశించిన దిగుబడి రాకపోవడం... పండిన పంటను కొనుగోలు చేసేవారు లేకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం మైలవరం మండలంలో చోటు చేసు కుంది. పోలీసులు, బంధువుల వివరాల మేరకు... మండ లంలోని దుగ్గనపల్లెకు చెందిన చీపాటి మోషే (52) అనే రైతు తనకున్న 5 ఎకరాలతో పాటు మరో 1.40 ఎకరాలు కౌలుకు తీసుకుని మిరపపంట సాగు చేశాడు. ఎకరాకు రూ.2 లక్షల మేర దాదాపు 12 లక్షల వరకు పంటసాగుకు అప్పులు చేసి పెట్టు బడి పెట్టాడు. మిరప కోత అనంతరం రెండు రోజుల క్రితం గుంటూరు మార్కెట్‌కు మిరపకాయలు తీసుకెళ్లాడు. అయితే మిరప కాయలపై దుమ్ము దూళి ఉండటం.. మిరప నాణ్యత సరిగా లేకపోవడంతో ఎవ్వరూ కొనుగోలు చేయలేదు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక.. తీవ్ర మనస్థాపానికి గురై గురువారం ఉదయం తన పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగి మృతి చెందాడు. కుటుం బసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహా న్ని పరిశీలించి.. పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి కుమారుడు, ఇద్ద రు కుమార్తెలు ఉన్నారు. కాగా, ఈ ఏడాది దాల్మియా పరి శ్రమ నుంచి వచ్చే దుమ్ము దూళితో మిరప పంట దిగుబ డి సరిగా రాక.. ధర లేకపోవడంతో మనస్థాపానికి గురై మృతి చెందినట్లు మోషే తండ్రి స్వామిదాసు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



ముద్దనూరు మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపల్లె సమీపంలో కడప- తాడిపత్రి హైవే పక్కన గురువారం బుల్లి అశోక్(32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం భద్రంపల్లెకు చెందిన బుల్లి అశోక్‌కు 10 సంవత్సరాల క్రితం కర్నూలు జిల్లాకు చెందిన అమ్మాయితో వివాహమైంది. 3 సంవత్సరాల క్రితం భార్య మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకొని భర్తను విడిచి వెళ్లింది. అప్పటి నుంచి అశోక్ మద్యంకు బానిసయ్యాడు. 15 రోజుల క్రితం భార్య వద్దకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లి తిరిగి వచ్చాడు. బుధవారం మళ్లీ భార్య వద్దకు వెళుతున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. అయితే కొత్తపల్లె సమీపంలోని రోడ్డు పక్కన మృతి చెందాడు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

కువైట్‌లో గోపవరం వాసి మృతి

గోపవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం కువైట్‌కు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు గాయపడి మూడునెలలు మృత్యువుతో పోరాడి.. చివరకు మృతి చెందాడు. గోపవరం మండలం అడుసువారిపల్లెకు చెందిన వంతెరపల్లె రమణారెడ్డి (53) కువైట్‌లో సెంట్రింగ్ పనులు చేస్తుండగా స్టీలు రాడ్లు మీద పడ్డాయి. తీవ్రంగా గాయపడ్డ రమణారెడ్డి చికిత్స పొందుతూ మార్చి 2న మృతి చెందాడు. కాగా గురువారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ ఇద్దరి మృతి

- ఏడుగురికి గాయాలు





మృతి చెందిన ముత్తరాసు లక్ష్మమ్మ, అంజనేయులు (ఫైల్)

ఎర్రగుంట్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గనిలో కూలి పని కోసం ట్రాక్టర్‌లో కూలీలు వెళుతుండగా లారీ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా... మరో ఏడుగురు గాయపడ్డారు. వివరాల్లోకెళితే... గురువారం ఉదయం చిలమకూరులో గనిలో పని కోసం ట్రాక్టర్‌లో ఎన్‌హెచ్ రోడ్డు నుంచి బయలుదేరారు. అదే సమయంలో మహారాష్ట్రకు చెందిన ఎంహెచ్‌జేఎల్ 7081 నెంబరుగల లారీ వెనుకవైపు నుంచి వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో ట్రాక్టర్ పడిపోవడంతో ట్రాక్టర్‌లో ఉన్న ముత్తరాసు లక్షుమ్మ (56) అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ వెంకట అంజనేయులు (52) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే ట్రాక్టర్‌లో ఉన్న ఓబయ్య, హరినాథ్, చిన్న ఓబన్న, గురప్ప, పొన్న వెంకటసుబ్బయ్య, బాల స్వామి, మల్లేల రోశయ్యలు గాయపడ్డారు. అర్బన్ సీఐ నరేష్ బాబు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను బంధువులకు అప్పగించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు.

వన్యప్రాణిని వేటాడిన ఇరువురిపై కేసు నమోదు

- నాటుతుపాకీ, జింక మాంసం స్వాధీనం

వేంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఫారెస్ట్ బీట్ కప్పలమడుగు ప్రాంతంలో వన్యప్రాణిని వేటాడిన వ్యవహారంలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఫారెస్టు రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. కుమ్మరాంపల్లెకు చెందిన శ్రీరాములు, నటరాజలు రెండు రోజుల క్రితం రాత్రి సమయంలో నాటుతుపాకీతో వన్యప్రాణులను వేటాడారు. సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించగా శ్రీరాములు పట్టుబడ్డాడు, నాటుతుపాకీతో పాటు జింకమాంసం స్వాధీనం చేసుకున్నారు. నటరాజ కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేశామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

కుక్కల దాడిలో జింక మృతి

పులివెందులటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ఉలిమెల పొలాల్లో బుధవారం రాత్రి కుక్కల దాడిలో జింక మృతి చెందినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు గురువారం ఫారెస్టు అధికారులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతి చెందిన జింకను పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల పశువైద్యశాలకు తరలించారు. డాక్టర్ రవికిరణ్‌రెడ్డి జింకకు పోస్టుమార్టం చేసి ఫారెస్టు అధికారులకు అప్పగించారు.

అర్.ఓ.సి.నెం.309/ఎ1/2017

పురపాలక సంఘ కార్యాలయము
పులివెందుల,
తేది : 06.03.2025

బహిరంగ వేలము ప్రకటన

వై.యస్.ఆర్.జిల్లా గెజిట్ నెం. 11/2025 నందు ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారము 2025-26 సంవత్సరమునకు అనగా 01-04-2025నుండి 31-03-2026వరకు ఈ పురపాలక సంఘమునకు సంబంధించిన ఈ దిగువన తెలిపిన ప్రదేశములలో ఫీజులు వసూలు చేసుకొనుటకు గుత్త హక్కుకొరకు తేది: 15.03.2025 ఉదయము 11.00గంటలకు కమీషనరు వారిచే లేక వారి అనుమతి పొందిన వారిచేగాని మునిసిపల్ ఆఫీసు కౌన్సిల్ హాలు నందు బహిరంగ వేలము వేయబడును. వేలములో పాల్గొనువారు దరావత్తు మొత్తమును కమీషనరు, పులివెందుల పురపాలక సంఘము పేరుమీద డిడిని తేది. 14.03.2025 సాయంకాలము 5.00 గం.లోపల సమర్పించవలెను. గుత్త వివరములకు ఎదురుగా తెలిపిన విలువకు సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించిన వారు మాత్రమే వేలములో పాల్గొనవలెను మరియు ఆఫీసు వేళలో ఆఫీసు నందు తెలుసుకొనవచ్చును.

వ. నెం.	గుత్త వివరములు	గుత్త కాలము	వేలమునకు ముందు కట్టవలసిన దరావత్తు (డి.డి. రూపములో)	మండల రెవెన్యూ అధికారి గారిచే జారీచేయబడిన సాల్వెన్సీ పత్రము /బ్యాంకు గ్యారంటీ	కేంద్ర ప్రభుత్వ సేవా పన్ను ప్రభుత్వము వారి ఉత్తర్వుల మేరకు అప్పటికి అమలులో ఉన్న పర్సేంటేజి ప్రకారము
1.	కూరగాయల మార్కెట్లు	01.04.2025 నుండి	15.00.000/-	10.00.000/-	18% (హెచ్చుపాటపై)
2.	నిలుపబడిన వాహనముల స్టాండు	31.03.2026	10.00.000/-	15.00.000/-	18% (హెచ్చుపాటపై)
3.	మాంసము మార్కెట్	వరకు	2.00.000/-	2.00.000/-	18% (హెచ్చుపాటపై)

పైన తెలిపిన గుత్త వేలములో హెచ్చుపాట ఖాయపరచిన వారు గుత్త మొత్తమును టేబుల్ పేమెంట్‌గా చెల్లించవలెను అనగా ఒకేసారి గుత్తమొత్తమును పూర్తిగా చెల్లించవలెను మరియు 7 రోజులలోపల తమ స్వంత ఖర్చులతో సబ్-రిజిస్ట్రారు వారి కార్యాలయములో గుత్త అగ్రిమెంటును రిజిస్టర్ చేయించుకోవలెను. అట్లు గుత్త రిజిష్టరు చేయని యెడల గుత్తను రద్దు చేయబడును. సదరు వేలములో పాల్గొనువారు తేది 14-03-2025 సాయంత్రము 5.00 గం.లలోపు సాల్వేన్సీ సర్టిఫికెట్‌తోపాటు కమీషనరు, పులివెందుల మునిసిపాలిటి పేరు మీద డిమాండు డ్రాఫ్టు (డిడి) ద్వారా చెల్లించి, చెల్లించిన ధరావత్తు పాటలో పాల్గొనవచ్చును. ఇతర వివరములు కొరకు మునిసిపల్ ఆఫీసు లోని రెవిన్యూ విభాగము నందు ఎ1 గుమస్తా / రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌ను సంప్రదించవలెను.

సం./- కమీషనరు
పులివెందుల పురపాలక సంఘము

గమనిక : బహిరంగ వేలములో పాల్గొను వారు పురపాలక సంఘమునకు ఎటువంటి బకాయిలు అనగా ఇంటిపన్ను, నీటి పన్ను, అంగళ్ళ పన్నుల బాకీ వుండరాదు. వేలము పాటలో పాల్గొనదలచిన పూర్వపు గుత్తదారులు పురపాలక సంఘమునకు పూర్తి బకాయిని చెల్లించి వేలము పాటలో పాల్గొనవచ్చును.

ప్రొద్దుటూరు పురపాలక సంఘము

నోటిఫికేషన్

రూల్ నెం. 169(3) & 169(4)(బి) ప్రకారం మరియు O/o DTCP A.P. Lr. Roc No. 17/08/2022-PLG-DOTCP, Dt. 13/09/2024 వారు ఇచ్చిన సర్క్యులర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు పురపాలక సంఘములోని క్రింద తెలిపిన ఓల్డ్ బిల్ట్ అప్ / గ్రామకంఠము / అగాడి ఏరియాలలో సర్క్యులేషన్ నెట్‌వర్క్ ప్లాన్‌లను తయారు చేయడం జరిగింది.

CP/RDP2024/PDTR/001 ఆఫ్ అరవింద ఆశ్రమం రోడ్డు, సరస్వతి విద్యామందిరం రోడ్డు
CP/RDP2024/PDTR/002 ఆఫ్ వినాయకనగర్, ఆర్ట్స్ కాలేజి రోడ్డు
CP/RDP2024/PDTR/003 ఆఫ్ నేతాజి నగర్ మెయిన్‌రోడ్డు, గురవయ్యతోట, బంగారయ్య కొట్టాల
CP/RDP2025/PDTR/001 ఆఫ్ కోటస్ట్రీట్, గంగమ్మ టెంపుల్ స్ట్రీట్, వెదుర్లబజార్, ఓల్డ్‌మార్కెట్
CP/RDP2025/PDTR/002 ఆఫ్ సుబ్బిరెడ్డి కాట్టాల, హోల్మస్‌పేట, ఇన్సైడ్ శ్రీరాములపేట
CP/RDP2025/PDTR/003 ఆఫ్ బుడ్డాయపల్లి, బాలజీ నగర్
CP/RDP2025/PDTR/004 ఆఫ్ సున్నపుబట్టి వీధి, పి.డబ్ల్యు.డి. ఆఫీస్ రోడ్డు
CP/RDP2025/PDTR/005 ఆఫ్ సాయికుటీర్ రోడ్డు, రామ్‌నగర్, ప్రకాష్‌నగర్
CP/RDP2025/PDTR/006 ఆఫ్ బొల్లవరం, బుడ్డాయపల్లి
CP/RDP2025/PDTR/007 ఆఫ్ మిట్టమడి స్ట్రీట్, మునయ్యకొట్టాల, దిన్నెమీది కొట్టాల
CP/RDP2025/PDTR/008 ఆఫ్ వీకర్‌సెక్షన్ 2వ వార్డ్, భాకరాపేట, సత్యపురం, ప్రకాశ్‌నగర్

ప్రస్తుతము ప్రొద్దుటూరు పురపాలక సంఘంలో చాలా ప్రాంతాలు చిన్నదారులు మరియు పాత నిర్మిత ప్రాంతాలలో 9 మీ (30 అడుగులు) కంటే తక్కువ వెడల్పు గల రోడ్లతో కూడుకుని ఉన్నాయి. సదరు స్థలములో భవనము ఎత్తు 10మీ (జి+2 ఫ్లోర్లు) మించకుండా ఉండునట్లు మరియు మాస్టర్‌ప్లాన్, రహదారి తప్ప మిగిలిన చిన్న రహదారులను వాటి ప్రస్తుత రోడ్డు వెడల్పులను 30 అడుగులు కన్నా తక్కువ ఉంటాయి. అటువంటి భవనములకు/స్థలాలకు నూతన భవన నిబంధనలు మేరకు 30 అడుగుల వరకు రోడ్డు భాగమును సంబంధిత పురపాలక సంఘం అనగా ఈ ప్రొద్దుటూరు పురపాలక సంఘమునకు (రిజిస్టర్డ్ గిఫ్ట్ డీడ్) ఉచితముగా అందజేయ వలసి ఉండేది. ప్రస్తుతము అందుకు ఉపశమనం కోసమై ఈ పురపాలక సంఘం పరిధిలో 29 ప్రాంతాలతో కూడిన 11 సంఖ్యలు గల సర్క్యులేషన్ నెట్వర్క్ ప్లానులు జిఐఎస్ నందు తయారు చేయడం జరిగింది. ఇందుపై Go.MS. No.4 of MA&UD(M), Dt. 09/01/2025 SECTION XIV in rule 169(1) sub rule (3)(b) అనుసరించి కమీషనర్ ప్రొద్దుటూరు పురపాలక సంఘము వారు సర్క్యులేషన్ నెట్‌వర్క్ నమూనా ముసాయిదాకు ఆమోదం తెలిపియున్నారు. ఈ నోటిఫికేషన్ జారీ చేసిన తేదినుండి ప్రజల వద్దనుండి వ్రాతపూర్వకంగా లేదా మెయిల్ ద్వారా పద్నాలుగు (14) రోజులలోపు సర్క్యులర్ నెట్‌వర్క్ ప్లాన్‌ల సరళిని సూత్రపాయంగా ఆమోదించడం పై ఏవేని అభ్యంతరాలను మరియు సూచనలను కోరడమైనది.

Mail ID : tpsection.mplproddatur@gmail.com

చిరునామా :
ప్రొద్దుటూరు పురపాలక సంఘము, గాంధీరోడ్డు, వసంతపేట, ప్రొద్దుటూరు
V. MALLIKARJUNA, Commissioner, Proddatur Municipality



చిత్రం చెప్పిన సమస్య

కమలాపురం తహసీల్దారు కార్యాలయం ఆవరణంలోని 104 వాహనం మూడేళ్లుగా నిరుపయోగంగా మారింది. ఎంతోమందికి వైద్య సేవలందించిన ఈ వాహనాన్ని పట్టించుకునేవారు లేక ప్రస్తుతం బురదలో కూరుకుపోయి, తుప్పు పట్టిపోయింది. ఇది.. అధికారుల నిర్లక్ష్యమో.. ? లేక ప్రభుత్వ వాహనమే కదా మాకెందుకు అనుకున్నారో..? కానీ వదిలేశారు. ఇది చూసిన ప్రతిఒక్కరూ ప్రభుత్వ ఆస్తులంటే మరీ ఇంత నిర్లక్ష్యమా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

- కమలాపురం రూరల్

ముగిసిన మావూళ్లమ్మ ఉత్సవాలు

- ఆకట్టుకున్న చెక్కభజన, కోలాటం
- అదుర్స్ అనిపించిన బండలాగుడు పోటీలు

చక్రాయపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలేకాంపల్లె గ్రామం చక్రాయి చెరువు సమీపాన వెలసిన మావూళ్లమ్మ నూతన ఆలయ మహోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. మూడు రోజుల పాటు హోమాలు, అభిషేకాలు గావించి గురువారం ధ్వజస్తంభాన్ని ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మూడు రోజుల పాటు అన్నదానం, చెక్కభజనలు, కోలాటాలు, హరికథ కాలక్షేపాలు, భక్తులకు వినోదాలు కల్పించేందుకు ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఎన్నో తరాలుగా మావూళ్లమ్మకు ఆలయం లేక భక్తులు ఇబ్బంది పడేవారు. కొందరు పెద్దలు ముందుకొచ్చి ప్రభుత్వ సహకారంతో, చందాల రూపంలో లక్షలాది రూపాయలు సేకరించి ఆలయాన్ని ప్రారంభించారు. కాగా నూతన ఆలయం ధ్వజస్తంభ మహోత్సవ కోసం పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి గురువారం చిలేకాంపల్లెకు రావడంతో అభిమానులు, కార్యకర్తలు ఆయనకు నారపురెడ్డిగారిపల్లె నుంచి ఘనంగా బాణసంచాలతో స్వాగతం పలికారు. అనంతరం మావూళ్లమ్మను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం సన్మానం చేశారు. కార్యకర్తలు మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందిస్తూ పలు గ్రామాల్లో నీటి ఎద్దడి తన దృష్టికి వచ్చిందని, తక్షణం ఉన్నతాధికారులతో సంప్రదించి నీటి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కృష్ణయ్య జాగ్రత్తలు తీసుకున్నారు. ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామం కావడంతో సమస్యలు తలెత్తుతాయేమోనని ఎస్పీ ఆదేశాలతో డ్రోన్ కెమెరా కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పట్టెం అశోక్, టీడీపీ యువనాయకుడు భాస్కర్‌రెడ్డి (ఎల్‌బీఆర్), బాలే రామాంజులరెడ్డి, మావిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఎద్దుల చంద్ర, రామ్మోహన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రామాంజులరెడ్డి, మాధవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అమర్, వెంకటరామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


బండలాగుడు పోటీల దృశ్యం

గుంటూరు ఎద్దు ఫస్ట్

ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఎద్దులతో బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా సొంత మొగులూరుకు చెందిన వజ్రాల తేజశ్వర్‌రెడ్డి ఎద్దులు మొదటి బహుమతి రూ.70వేలు సాధించారు. జిల్లా నుంచి ఆరు జతల ఎద్దు వచ్చాయి. అలాగే గుంటూరు జిల్లా పెద్దగోటిపాడు గరికపాటి లక్ష్మయ్య చౌదరి రెండవ బహుమతి రూ.50వేలు అందుకున్నారు. మూడవ బహుమతి కడప జిల్లా బాలయ్యగారిపల్లె విష్ణువర్ధన్‌రెడ్డి రూ.30వేలు అందుకున్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన తేజశ్వర్‌రెడ్డి నాలుగో బహుమతి అందుకున్నారు. ప్రొద్దుటూరుకు బెరుజురు ప్రణయ్ ఐదవ బహుమతి, ప్రొద్దుటూరుకు చెందిన చెన్నకేశవ బహుమతి అందుకున్నారు.

విద్యార్థులకు అవగాహన

వల్లూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వల్లూరు పోలీసుస్టేషన్‌లో గురువారం మధ్యాహ్నం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు ఏఎస్ఐ ప్రసాద్ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ముందుగా స్టేషన్‌లో పోలీసులు నిర్వహించే విధులను వారికి వివరించారు. అలాగే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఉన్న సెట్ కాన్ఫరెన్స్, ఖైదీల జైలు, బ్యారెక్‌ల గురించి వివరించారు. అనంతరం ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌లను రైటర్ రూమును, ఎస్ఐ రూమును చూపించి వివరించారు. విద్యార్థులు కూడా తమ గురువులు, తల్లిదండ్రులు చెప్పిన రీతిలో చదువుకోవాలని ఏఎస్ఐ వారికి వివరించారు. వీరితో పాటు స్థానిక పోలీసులు, హెడ్‌కానిస్టేబులు నాగేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, పీఈటీ తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కూలీలకు అందని వేతనాలు

లింగాల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదని వారు వాపోతున్నారు. జనవరి 18 నుంచి ఇప్పటివరకు రూ.78 లక్షలు బకాయిలు ఉనట్లు తెలిసింది. మండల వ్యాప్తంగా 5214 జాబ్‌కార్డులు ఉన్నాయి. 796 మంది కూలీలకు వేతనాలు రావాల్సి ఉంది. దీనిపై ఏపీడీ సోమశేఖర్ రెడ్డిని వివరణ కోరగా.. త్వరలోనే ప్రభుత్వం వేతన బకాయిలు విడుదల చేస్తుందని, వచ్చిన వెంటనే కూలీలకు అందిస్తామని తెలిపారు.

హుండీ లెక్కింపు

కడప కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగర ఆకుల వీధిలో వెలసిన రాజరాజేశ్వరి దేవి ఆలయ హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి ఆ ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీధర్‌తో పాటు ఆ శాఖ అధికారి సుబ్బమ్మ, ఆలయ ప్రధాన అర్చకులు పిడతల గోపాలక్రిష్ణశర్మ హాజరయ్యారు. ఆ మేరకు దాదాపు ఆరు నెలల పాటు అమ్మవారి దర్శనానికి ఆలయానికి వచ్చిన భక్తులు రూ.1,43,678 కానుకల రూపంలో హుండీలో సమర్పించినట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ధర్మకర్త పాల్గొన్నారు.

బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలి

- విద్యార్థులకు పోలీసు ఆయుధాల ప్రదర్శనలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో కష్టపడి చదివి ఎంచుకున్న రంగంలో రాణించి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ అశోక్‌కుమార్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యంలో మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌస్ ఎగ్జిబిషన్‌ను జిల్లా ఎస్పీ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా బాగా చదివి తల్లిదండ్రులకు, చదివిన విద్యాలయానికి మంచి పేరు తేవాలని సూచించారు. పోలీసులు విధి నిర్వహణలో భాగంగా వారు వినియోగించే ఆయుధాలు, దుస్తులు, పనిముట్లు, నేర దర్యాప్తు విధానం తదితర విషయాలను విద్యార్థులకు తెలిపేందుకు ఓపెన్‌హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పోలీసు ఆయుధాల గురించి వివరించారు. బాంబు డిస్పోజబుల్ టీం, ఫింగర్ ప్రింట్, పోలీసు కంట్రోల్ రూము, కమ్యూనికేషన్స్, ఆయుధాలు విడిభాగాల గురించి రైఫిల్స్, గ్యాస్‌గన్, గ్రనేడ్, ఫోరెన్సిక్, బాడీవార్న్ కెమెరాలు, డ్రోన్ కెమెరా, వీహెచ్‌ఎఫ్‌సెట్, రోబోడ్రెస్ తదితరాల గురించి వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ ఆనంద్, నగరంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.


ఆయుధాలను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

భూ సమస్యలను సత్వరం పరిష్కరించండి

- మంత్రికి విన్నవించిన పార్థసారధి

వేముల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను సత్వరం పరిష్కరించేలా అధికారులు ఆదేశాలివ్వాలని మంత్రి సవితను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి కోరారు. గురువారం విజయవాడలోని మంత్రి నివాసంలో కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. రైతుల భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.


మంత్రి సవితకు వినతిపత్రం సమర్పిస్తున్న పార్థసారధిరెడ్డి

పోస్టాఫీసు సేవలపై అవగాహన

సీకేదిన్నె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలపై డ్వాక్రా మహిళలు అవగాహన పెంచుకోవాలని పోస్టల్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సచ్చిన్ మిట్టల్ తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలోని వెలుగు కార్యాలయంలో గురువారం పోస్టల్ శాఖ అమలు చేస్తున్న సుకన్య సంవృద్ధియోజన, రికరింగ్ డిపాజిట్, ఇన్సూరెన్స్ వంటి పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా పథకాలను రూపొందించి అమలు చేస్తుందని, మహిళలు వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ప్రాజెక్టు మేనేజర్ నీలకంఠారెడ్డి, ఏపీఎం వెంకటరమణరాజు, సీసీలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌నాయక్

ఆరేళ్లు సర్వీస్ ఉన్న వారినే నియమించాలి

- డీఈఓకు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వినతి

కడప ఎడ్యుకేషన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్ల సర్వీస్ ఉన్నవారిని చీఫ్ డిపార్ట్‌మెంట్ అధికారులుగా నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని డీఈఓ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు డీఈఓ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో డిపార్ట్‌మెంట్, చీఫ్ సూపరింటెండెంట్లుగా అతి తక్కువ సర్వీసు గల పాఠశాల సహాయకులను నియమిస్తున్నారని, కనీసం ఆరు సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన వారిని నియమించాలని కోరుతున్నామన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు పాల్గొన్నారు.


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

వేంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఇంటెల్ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఏడుమంది ఈసీఈ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బెంగుళూరుకు చెందిన ఇంటెల్ కంపెనీ రూ.45 వేలు నెల వేతనానికి ఏడు మంది విద్యార్థులను ఎంపిక చేసుకుందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్ అభినందించారు. ఏఓ రవికుమార్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వినోద్, సుందర్ పాల్గొన్నారు.



నేడు అంకాలమ్మ వార్షికోత్సవ పూజలు

వేంపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని రాజీవ్‌నగర్‌కాలనీలో వెలసిన అంకాలమ్మతల్లి వార్షికోత్సవ పూజలను 7వ తేది శుక్రవారం ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు ఈ పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా చెక్కభజన, కోలాటం, సాసవుల చిన్నమ్మ కథ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు.

తమిళనాడును ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన చేసే ప్రక్రియను 30 ఏళ్లపాటు వాయిదా వేయాలి లేదా 1971 జనాభా ప్రాతిపదికనే చేయాలంటూ తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో జరిగిన ఆ రాష్ట్ర అఖిల పక్ష సమావేశం తీర్మానం చేయడం ఆహ్వానించదగినదని ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భిన్నమైన సిద్ధాంతాలు, విధానాలు కలిగినప్పటికీ తమ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తమళనాడులో ఎన్డీఏను బలపరిచే పార్టీలు సైతం సదరు తీర్మానాన్ని బలపర్చడం గమనార్హం అని పేర్కొన్నారు. ఇదే వైఖరిని ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా అనుసరించాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు. లేదంటే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుందనని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గాల పునర్విభజనను జనాభా ప్రాతిపదికన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రయోజనాలనే తప్ప రాజకీయాలను చూడాల్సిన అవసరం లేదని సూచించారు. ఇందుకు తమిళనాడు రాష్ట్రాన్నే మనం ఆదర్శంగా తీసుకోవాలని, ఈ అంశంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి స్పందించాలని ఆయన కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

- మంత్రి లోకేశ్‌తో చైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని ఉండవల్లిలోని రాష్ట ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారాలోకేశ్ నివాసంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. నియోజకవర్గం గత పాలకుల వల్ల కుంటుపడిందని, పలు పెండింగు పనులకు నిధులు త్వరితగతిన మంజూరు చేయించాలని లోకేశ్‌ను కోరారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యగా ఉన్న ఫ్లైఓవర్‌కు గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులకు శంకుస్థాపన చేశారని, ఆ పనులు ఇంతవరకు ప్రారంభం కాలేదని, ఇప్పటికైనా నిధులు కేటాయించాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలో ప్రధానంగా సర్వరాయసాగర్, వామికొండ తదితర ప్రాజెక్టులు ఉన్నాయని వాటి నిర్మాణం కోసం నిధులు కేటాయిస్తే లక్షల ఎకరాలకు సాగునీరు అందించిన వారవుతారని, ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.


నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే

వక్ఫ్ భక్షణ చట్టాన్ని బహిష్కరించండి : కాంగ్రెస్

కడప కలెక్టరేట్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల చట్టం-2024ను వక్ఫ్ భక్షణ చట్టం అని, దీన్ని అందరూ బహిష్కరించాలని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీఖాన్, నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, మాజీ కార్పొరేటర్ రంతుల్లాఖాన్‌లు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని రెండో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలు వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మతాలను రెచ్చగొట్టే విధంగా బీజేపీ అప్రజాస్వామిక పాలన చేస్తోందన్నారు. మోదీ సర్కారు 1995 వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసి కొత్తగా చట్టాన్ని తేవడాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత సిరాజుద్దీన్, మహిళా నేతలు శ్యామలమ్మ, సంజయ్ కాంత్, దినకర్‌రెడ్డి, హమీద్, కమాల్‌బాషా పాల్గొన్నారు.


గాంధీవిగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

ఘనంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కడప కల్చరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగర 15వ డివిజను పుట్లంపల్లె గ్రామంలో ధనకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి విగ్రహ దాత నాగిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయంలో వెలసిన ఆ తల్లి విగ్రహ అభిషేకానికి గంగానది నుంచి నీటితో అభిషేకం కార్యక్రమం నిర్వహించి అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వృషభరాజములచే బండలాగుడు పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు రమణారెడ్డి, మదన్, రాజారెడ్డి, పాలకొండరాయ దేవస్థానం చైర్మన్ రెడ్డయ్య, ప్రజలు పాల్గొన్నారు.


గంగమ్మ విగ్రహానికి పూజలు చేస్తున్న దృశ్యం

6వ రోజూ మహిళా వారోత్సవాలు


విద్యార్థినిలకు సూచనలు చేస్తున్న కడప తాలుకా సీఐ

కడప క్రైం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మార్చి 8 వరకు జిల్లాలో మహిళా సాధికారత వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారం నాటికి 6వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా పోలీసుస్టేషన్లలో పోలీసుల దైనందిన విధులపై ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప తాలుకా సీఐ వెంకటేశ్వర్లు పోలీసు స్టేషన్లు సందర్శించిన విద్యార్థినులకు పోలీసుస్టేషన్‌లో జరిగే విధులు, మహిళా సహాయకేంద్రం, పోలీసుల పనితీరు, విధుల్లో ఉపయోగించే పరికరాల గురించి అవగాహన కల్పించారు. మహిళా చట్టాలు, పోక్సో యాక్టు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ తదితర చట్టాల గురించి వివరించారు.

దేవదాయశాఖ మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా



ఆలయాల అభివృద్ధికి సహకరించండి : ఎమ్మెల్యే

మైదుకూరు రూరల్, మార్చి6 (ఆంధ్ర జ్యోతి): మైదుకూరు నియోజకవర్గంలోని దేవాలయాల్లో నెలకొన్న సమస్యల గురించి రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి అనం రామ నారాయణరెడ్డితో గురువారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చర్చించారు. విజయవాడలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో విరామ సమయంలో ఆయన ధూపదీప నైవేద్యాల గురించి, ఎండోమెంటు సమస్యల గురించి మంత్రితో మాట్లాడారు.

సిమెంటు రోడ్ల పరిశీలన

పోరుమామిళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగ్రహారంలో వేసిన సిమెంటు రోడ్లను బీజేపీ నాయకులు రమణాచారి, నారిశెట్టినాగేంద్ర, పల్లెంశెట్టిపండరి తదితరులు గురువారం పరిశీలించారు. రోడ్ల నాణ్యతా ప్రమాణాల గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రభుత్వ ం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

‘చలో విజయవాడ’ను విజయవంతం చేయండి

జమ్మలమడుగు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సమస్యలపై ఈనెల 10వ తేదీ నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంగన్వాడీ అసోసియేషన్ ఏఐటీయూసీ ప్రాజెక్టు కార్యదర్శి నరసమ్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి రాజేశ్వరిదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలను నమ్మించి మోసం చేసిందని, కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషన్ కమిటీ సభ్యులు శివమ్మ, రామలక్ష్మి, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

బీవీఎస్ థియేటర్, ఆరవేటి థియేటర్ వద్ద మండుటెండలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు





స్థానిక షాపుల వద్ద ఉన్న నీడలో సేదతీరుతున్న విద్యార్థులు



బస్ షెల్టర్ నిర్మించరూ..

- ఎండలో ప్రయాణికుల ఇబ్బందులు
- చలువ పందిర్లు అయినా ఏర్పాటు చేయాలని వినతి

ప్రొద్దుటూరు అర్బన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని బీవీఎస్ థియేటర్, ఆరవేటి థియేటర్ల వద్ద ప్రయాణికులు బస్సుల కోసం మండు టెండలో పడిగాపులు కాస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 40 డిగ్రీల ఎండలో పరీక్షల అనంతరం విద్యార్థులు, హాస్పిటల్ కోసం వచ్చిన పేషెంట్లు, వృద్ధులు మండుటెండలో బస్సుల కోసం వేచి చూస్తున్నారు. వివిధ అవసరాల కోసం ప్రతి రోజు వేల మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి బయలుదేరుతారు. బస్సుల కోసం వేచి వుండేందుకు చిన్న షెల్టర్ కూడా ఇక్కడ ఏర్పాటు చేయలేదు. కనీసం చలువ పందిరి కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఎండలకు తట్టుకోలేక విద్యార్థులు స్థానికంగా ఉండే షాపుల వద్ద గల నీడలో సేదతీరుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికులకు తగిన సౌకర్యాలతో పాటు తాగునీరు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంటింటి చెత్తసేకరణపై అవగాహన కల్పిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి



గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి : డీపీవో

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాల నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను రోడ్లపైన వేయకుండా బుట్టల్లో నింపి పారిశుధ్య కార్మికులకు అందించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా గురువారం ఆమె మండల పరిధిలోని కొత్తపల్లి, గోపవరం గ్రామ పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తపల్లిలోని అమృతానగర్, వివేకానందనగర్, ఖాదర్‌బాదు, లక్ష్మినగర్‌లలో పర్యటించి ఇంటింటి నుంచి చెత్తను సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. గోపవరం పంచాయతీ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, శ్రీనివాసపురం, యానాది కాలనీల్లో పర్యటించి తడిచెత్త, పొడిచెత్త వేరుచేయు విధానాన్ని ప్రజలకు వివరించారు. కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని తనిఖీ చేసి వర్మీ కంపోస్టు తయారీకి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామాంజనేయులరెడ్డి, కార్యదర్శులు రామమోహన్, రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై నిగ్గు తేల్చండి

మండల పరిధిలోని గోపవరం పంచాయతీ పరిధిలో గతంలో కార్యదర్శిగా పనిచేసిన గురుమోహన్ లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడ్డారనే ఫిర్యాదులు, అందిన ఆధారాలను పరిగణలోకి తీసుకుని దర్యాప్తును వేగవంతం చేసి నిజాలను నిగ్గు తేల్చాలని ఫిర్యాదీదారుడు, గోపవరం మాజీ వార్డు సభ్యుడు మార్తల వెంకటసుబ్బారెడ్డి డీపీవో రాజ్యలక్ష్మిని కోరారు. అవినీతి ఆరోపణలపై డీఎల్‌పీవో చేసిన దర్యాప్తు అసంపూర్తిగా ఉందని, విచారణ అధికారులు కాలయాపన చేస్తూ నిజాలను నిగ్గు తేల్చడంలేదని వాపోయారు. స్పందించిన డీపీవో త్వరితగతిన విచారణ పూర్తయ్యేలా ఆదేశాలు జారీ చేశామని, త్వరలో నివేదిక తయారు చేసి వాస్తవాలను వెలుగులోకి తెస్తామని ఆమె పేర్కొన్నారు.

ప్రతిరోజూ శుభ్రం చేయాలి

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతిరోజూ శుభ్రం చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి రాజ్యలక్ష్మి సూచించారు. గురువారం లక్ష్మిపేటలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న డోర్‌టుడోర్ చెత్త సేకరణ, ఐజీఆర్ఎస్ కాల్స్ గురించి ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణిని అడిగి తెలుసుకున్నారు.

వెనుకబడిన పిల్లలను తీర్చిదిద్దాలి : డిప్యూటీ డీఈవో

కొండాపురం, మర్చి 6 (ఆంధ్రజ్యోతి): ట్రైనింగ్ పొందిన ఉపాధ్యాయులు వెనుకబడిన పిల్లలను తీర్చిదిద్దాలని డిప్యూటీ డీఈవో మీనాక్షి సూచించారు. మండల కేంద్రమైన కొండాపురంలో గురువారం జడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. పిల్లల విద్యాప్రమాణాలను పరిశీలించారు ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఓబులేసు, రామయ్య, టీచర్ రాజ పాల్గొన్నారు.

9న ఆర్యవైశ్య సభ ప్రత్యేక సర్వసభ్య సమావేశం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సభ ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు స్థానిక అమ్మవారిశాలలో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తయిన ఆర్యవైశ్యులు ఈ సమావేశంలో పాల్గొని తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

కాశిరెడ్డినాయనస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మైలవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరమలవారిపల్లి ఈడుగోనిబావి వద్ద తాడిపత్రి మెయిన్‌రోడ్డులో ఈ నెల 9వ తేదీన అవధూత కాశిరెడ్డినాయన స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న పూజా కార్యక్రమాలు, హోమాలు, 8న గ్రామోత్సవం, 9న ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు సత్యహరిశ్చంద్ర నాటకం, అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదు : పీడీ

పోరుమామిళ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో తప్పులు చేసినా, అవకతకవలు పాల్పడినా ఉపేక్షించేది లేదని ప్రాజెక్టు డైరెక్టరు ఆదిశేషారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని స్త్రీశక్తి భవన్ ఎదుట సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అక్కడక్కడా చిన్నచిన్న తప్పులు దొర్లినట్లు తెలుస్తుందని, ఇలాంటివి ఇంకోసారి పునరావృతమైతే సహించేది లేదన్నారు.ఈ కార్యక్రమంలో రూ.20వేలు రికవరీ, హార్టికల్చర్‌కు సంబంధించి రూ.39వేలు పెనాల్టీ విధించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ ఆఫీసరు రామలింగారెడ్డి, క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయకుమార్, ఏపీడీ ఆనంద్, ఎంపీడీవో రమణారెడ్డి, ఏపీవో రవిచంద్రారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సీఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో సాయిశ్రీ



లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేసులు తప్పవు : ఆర్డీవో

జమ్మలమడుగు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుపరచాలని, ఎవరైనా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శివప్రసాద్, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడబిడ్డ అయినా, మగబిడ్డ అయినా సమానంగా చూడాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరిదేవి, హెల్త్ అధికారి వెంటేశ్వర్లు, కమిటీ సభ్యులు సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారుడు ప్రొద్దుటూరు టవున్ గాంధీరోడ్డులోని డి.నెం.8/7లో నివాసముండే **బండారు రామయ్య కుమారుడు బండారు సూర్యనారాయణ** యొక్క సూచనల మేరకు ఇవ్వు పబ్లిక్ నోటీసు ఏమనగా నా కక్షిదారుడు ప్రొద్దుటూరు టౌన్, వైఎంఆర్ కాలనీలోని డి.నెం. 3/947లో నివాసముండే డా. బసిరెడ్డి వెంకట రమణారెడ్డి భార్య బసిరెడ్డి సుశీల గారి మీద దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి నా కక్షిదారుని పేరమీద రిజిస్టర్డు విక్రయ దస్తావేజు వ్రాయించి ఇవ్వాలని రాజశ్రీ ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు నందు **O.S.No. 49/2023** దావా దాఖలు చేసి అట్టి దావాలో సదరు కోర్టు వారు సదరు బసిరెడ్డి సుశీల గారు షెడ్యూలు దాఖలా ఆస్తిని సదరు దావా పూర్తి పరిష్కారం అయ్యేంతవరకు ఇతరులకు ఎవ్వరికి అమ్మకూడదని **I.A.No. 1510/2023** పిటిషన్‌లో టెంపరరీ ఇంజంక్షన్ ఇచ్చారు. కాబట్టి ఎవ్వరు కూడా దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించి సదరు బసిరెడ్డి సుశీల గారి వద్దగాని లేక ఆమె తరఫున ఎవ్వరితోనైనా క్రయ, విక్రయాలు జరుపకూడదు. అవి చెల్లవు. అట్టివారిపై నా కక్షిదారుడు సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకొంబడును.

షెడ్యూలు

YSR Dt. previously Proddatur Registration Dt. at present Kadapa Registration Dt. Proddatur Sub-Dt., Proddatur Mdl, Thallamarpuram Panchayat, Thallamarpuram Village Fields, Land situated as follows :
S.No. 1080-5 Pyki Ac. 0-94 Cents,
S.No. 1080-4 Pyki Ac. 0-89 Cents,
S.No. 1080-3 Pyki Ac. 0-24 Cents,
S.No. 1079-5 Pyki Ac. 0-81 Cents,
S.No. 1079-4 Pyki Ac. 0-84 Cents,
S.No. 1079-3 Pyki Ac. 0-35 Cents,
S.No. 1078-5 Pyki Ac. 0-46 Cents,
S.No. 1078-4 Pyki Ac. 0-70 Cents,
S.No. 1078-3 Pyki Ac. 0-20 Cents,
S.No. 1077-4 Pyki Ac. 0-17 Cents
Total Ac. 5-60 cents, further Pyki Ac.2-80 cents land bounded as follows :
East : Land of Mudireddy Venkata Subba Reddy,
West : Land of Donthu Ramachandraiah and Sagala Suresh Babu,
North : Land of Parnapalle Jabbar Saheb,
South : Road,
Within these boundaries Land with an extent of Ac. 2-80 cens with all easement rights.

ఇట్లు, **విశ్వనాథం రమేష్‌బాబు**, అడ్వకేట్,
డి.నెం : 8/581, గిడ్డంగి వీధి, ప్రొద్దుటూరు, సెల్: 94415 00950

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి

బి.కోడూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రబీ సీజనులో సాగు చేసిన ప్రతి పంటను ఈ-పంట నమోదు చేయించుకుని, అలాగే ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి కౌశిక తెలిపారు. గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సిద్దుగారిపల్లెలో పెసర, మినుము పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, రాయితీలు పొందాలంటే తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ప్రతి పంటకు వచ్చే రోగాలను ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన మోతాదులో మందు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి

బద్వేలుటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంచాయతీకి ఒక మోడల్‌స్కూలు పేరుతో ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో విలీనం చేయడం తగదన్నారు. దీనివల్ల ప్రైవేటు విద్యాసంస్థలు బలోపేతం అవుతాయన్నారు. విద్యావ్యవస్థను పటిష్ఠం చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రారంభమైన ఉపాధి పనులు

రాజుపాలెం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు మండలంలోని గ్రామాల్లో మొదలయ్యాయి. రోజుకు 650మందికి పైబడి ఈ పనుల్లో పాల్గొంటున్నట్లు ఏపీవో లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రస్తుత ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 నుంచి 11గంటల వరకు పనులు చేపట్టే విధంగా అధికారులు నిర్దేశంచారని, రోజువారి కూలి వారు చేసే పనిని బట్టి రూ.270 వరకు వచ్చే అవకాశం ఉందన్నారు.

భూ పోరాటాలకు సిద్ధం కావాలి : సీపీఎం

బద్వేలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూమి లేని పేదలు భూపోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుచి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎన్‌జీవో హోంలో సీపీఎం బద్వేలు పట్టణ కార్యదర్శి కె.శ్రీను అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి ‘భూ బాధితులు-వలసల నివారణ’పై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మార్చి 15వ తేదినుంచి బద్వేలు నియోజకవర్గంలోని 15 గ్రామాలలో, బ్రహ్మంగారి మఠం మండలంలోని 5 గ్రామాలలో భూమిలేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని, వారికి సీపీఎం అండగా ఉంటుందన్నారు. నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలో పేదల ఐక్య వేదికలు ఏర్పాటు చేసి సామాజిక న్యాయం కోసం పోరాటాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్వేష్, కమిటి సభ్యులు చాంద్‌బాష, వెంకటేష్, నియోజకవర్గ పరిధిలోని భూ బాధితులు వలస కార్మికులు పాల్గొన్నారు.

‘రోడ్లను అభివృద్ధి చేయాలి’



ప్రొద్దుటూరు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రముఖ వాణిజ్య కేంద్రంగా గుర్తింపు పొందిన ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేయాలని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి పేర్కొన్నారు. గురువారం సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిని గురించి వివరించారు.

కార్మిక సంక్షేమానికి కృషి చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ పేర్కొన్నారు. గురువారం విజయవాడలో టీఎన్‌టీయూసీ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొంటుముక్కల రఘురామరాజును కలిసి వినతిపత్రం అందించారు. డ్రైవర్ల సాధికార సంఘం ఏర్పాటు చేయాలని, చంద్రన్నబీమా పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు.

వాహన మిత్ర అమలు చేయాలి

ఎర్రగుంట్ల, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం అమలు చేసి రూ.15వేలు ఇవ్వాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయుసీ నేత సుబ్బారెడ్డి, ఆటో వర్కర్స్ సుబ్బయ్య, రామయ్య, తిరుపాల్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

చెత్తసంపద కేంద్రాలను అధికారులు పర్యవేక్షించాలి

- ఎంపీడీవో వెంగమునిరెడ్డి

బ్రహ్మంగారిమఠం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 పంచాయతీల్లో ఉన్న చెత్తసంపద కేంద్రాలను ప్రతిరోజూ సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఎంపీడీవో వెంగమునిరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం -1 పరిధిలో ఉన్న చెత్తసంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ వారానికి ఒకసారైనా సంపద కేంద్రాన్ని పరిశీలించి గ్రామాల్లో చెత్త తీసుకుని వస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ సురేశ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

ఫారంపాండ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఖాజీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రైతు పొలాల్లో ఏర్పాటు చేసే ఫారంపాండ్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కూనవారిపల్లె పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఫారంపాండ్ గుంతలు మందులు పిచికారి చేసేందుకు, వేసవి కాలంలో బోరుబావుల్లో నీరు తక్కువ వస్తుంటే ఈ గుంతలకు నీరు నింపి ఇక్కడి నుండి డ్రిప్ ద్వారా మొక్కలకు నీటిని అందించవచ్చని తెలిపారు. ఈ గుంతలను ప్రభుత్వం ఉపాధి కూలీలతో ఏర్పాటు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఈ విజయభాస్కర్, ఏపీడీ సుబ్బారెడ్డి, ఈసీ రాధాకుమారి, టెక్నికల్ అసిస్టెంట్లు సుబ్బారావు, సునీత, ఫీల్డ్ అసిస్టెంట్ సాంబశివారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న అధికారులు

కొనసాగిన విద్యార్థుల దీక్ష



కళాశాల ఆవరణంలో దీక్ష చేపట్టిన విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. దీంతో గురువారం 32వ రోజుకు చేరింది. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్షాశిబిరంలో విద్యార్థులు శాంతియుతంగా సమ్మెను కొనసాగించారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరేవరకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తమ పోరాటాన్ని ఆపేది లేదని విద్యార్థులు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపకారవేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు.

భార్యపై కత్తితో దాడి

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో బీసీ కాలనీలో ఎర్రిబోయిన బాస్కర్ తన భార్య కళావతి(40)పై గురువారం మధ్యాహ్నం కత్తితో దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల వివరాల మేరకు.. భాస్కర్ పక్షపాతంతో బాధపడుతున్నాడు. గతకొంత కాలంగా కళావతిపై అనుమానం పెంచుకున్నాడు. గురువారం కూలిపనికి వెళ్లివచ్చిన కళావతిని దూషించి కత్తితో దాడిచేసి గాయపరిచాడని, ఆమె కేకలు వేయడంతో భాస్కర్ పారిపోయాడన్నారు. ఈ దాడిలో కళావతి తలకు, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలు కాగా ఆమెను ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు. ట్రైనింగ్ డీఎస్పీ భవానీ సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

చాపాడు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన పాలూరు లక్ష్మి (35) కర్నూలులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 2వ తేదీన తన ఆడబిడ్డ దేవిలక్ష్మితో గొడవపడి బాధపెట్టిందని మనస్థాపంతో పురుగుల మందు తాగిందని, అపస్మారకస్థితిలో ఉన్న ఆమెను చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడే లక్ష్మి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు పేర్కొన్నారు. దేవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలే చోరీ

గోపవరం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మడకలవారిపల్లెలో జాతీయరహదారి పక్కనే ఉన్న పీర్ల సుబ్రమణ్యం అనే వ్యక్తి ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి బీగాలు పగలగొట్టి బీరువాలో ఉన్న సుమారు 17 తులాల బంగారు నగలు, 4లక్షల నగదును అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాతంశెట్టి నాగేంద్ర పేర్కొన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిర్భావ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రొద్దుటూరు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు శివకల్యాణ్, జిలానీబాష, మాదాసు మురళి, శివ, సుంకర మురళి, రమణ, రంజిత్, రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.